సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
సోమవారం, 31.08.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 301
పేజీలు: 08 వెల: రూ. 5

## ప్రాణహిత-చేవెళ్లకు
# పునరుజ్జీవం

తెలంగాణ ప్రభుత్వం ముందడుగు

తుమ్మిడిహట్టికి 152 మీటర్లే లక్ష్యం

- మహారాష్ట్ర అనుమతి కోసం తెలంగాణ కసరత్తు..
- 80 టీఎంసీలు గురుత్వాకర్షణతో సుందిళ్లకు తరలించే అవకాశం
- సెప్టెంబర్ 1న ఢిల్లీలో కీలక అంతర్రాష్ట్ర చర్చలు..
- ప్రాణహిత-చేవెళ్ల ఆయకట్టు పునరుద్ధరణపై ప్రభుత్వం దృష్టి

**ముద్ర డెస్క్:** ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు పునరుజ్జీవం కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నదిపై 152 మీటర్ల స్థాయిలో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర సమ్మతి సాధించడమే తమ లక్ష్యమని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే దాదాపు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను భారీ ఎత్తిపోతలు లేకుండా గురుత్వాకర్షణ ఆధారంగా సుందిళ్ల బ్యారేజీ వరకు తరలించే అవకాశం ఉంటుందని తెలిపారు.

సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ–మహారాష్ట్ర మధ్య జరగనున్న అంతర్రాష్ట్ర చర్చలకు ముందు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి శనివారం సచివాలయంలో ఉన్నతస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఢిల్లీలో ప్రస్తావించాల్సిన సాంకేతిక, న్యాయపరమైన అంశాలు, 152 మీటర్ల బ్యారేజీతో తెలంగాణకు కలిగే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, గురుత్వాకర్షణ ద్వారా నీటి తరలింపు సాధ్యాసాధ్యాలపై సమగ్రంగా చర్చించారు.

**సీడబ్ల్యూసీ సమక్షంలో కీలక భేటీ**

సెప్టెంబర్ 1న జరిగే సమావేశానికి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఛైర్మన్ అధ్యక్షత వహించనున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర ఉన్నతాధికారులతో పాటు సీడబ్ల్యూసీలోని కీలక డైరెక్టరేట్ల అధిపతులు పాల్గొంటారు. బ్యారేజీ ఎత్తు, ముంపు, సాంకేతిక సాధ్యాసాధ్యాలు, అంతర్రాష్ట్ర అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నాయి. కేంద్రం వేదికగా రెండు రాష్ట్రాల మధ్య అధికారిక చర్చల ప్రక్రియ ప్రారంభం కావడం ప్రాణహిత పునరుజ్జీవనంలో కీలక ముందడుగు అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కేంద్రంతో జరిపిన నిరంతర సంప్రదింపులు, ఉత్తర ప్రత్యుత్తరాల ఫలితంగానే ఈ చర్చలకు మార్గం సుగమమైందన్నారు. మిగతా 02లో



## డ్రగ్స్‌పై అవగాహన
# కల్పించండి

కంటెంట్ క్రియేటర్లు.. యూట్యూబర్లకు మోదీ సూచన

- మాదకద్రవ్య రహిత భారత్ లక్ష్యంగా పనిచేయండి
- వీధి వ్యాపారుల కోసం తీసుకువచ్చిన 'పీఎం స్వనిధి యోజన'
- మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం



**ముద్ర, ఢిల్లీ:** క్షణికమైన ఆనందాన్నిచ్చే మత్తు పదార్థాలు ఉజ్వల భవితను దెబ్బతీసి వ్యక్తిగత జీవితాన్ని అంధకారంలోకి నెట్టేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. మాదకద్రవ్య రహిత సమాజం కోసం ప్రతినబూనాలని యువతకు పిలుపునిచ్చారు. ఎటువంటి మత్తు పదార్థాలకైనా బానిసలు కాకుండా దూరంగా ఉండేలా మానసిక, శారీరక దృఢత్వాన్ని కలిగి ఉండాలన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో అవగాహన కల్పించాలని కంటెంట్ క్రియేటర్లు, యూట్యూబర్‌లకు సూచించారు. ఆదివారం మన్‌కీ బాత్ 137వ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఈ మేరకు యువతకు దిశానిర్దేశం చేశారు.

'మాదక ద్రవ్య రహిత భారత్' (Drug Free India) లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి వ్యక్తి, కుటుంబం, సమాజం, దేశం యావత్తూ కలిసి రావాలని మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వ్యసనం నుంచి విముక్తులైన వారిని సమాజం అక్కున చేర్చుకుని గౌరవించాలన్నారు. సమాజమద్దతు, యోగ, ధ్యానం, దృఢచిత్తం, ఆత్మవిశ్వాసం ద్వారా మత్తుపదార్థాలకు దూరం కావొచ్చన్నారు. 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాంలో యువత పెద్ద మొత్తంలో హాజరవుతున్నారని పేర్కొన్నారు.

**పీఎం స్వనిధి యోజన..**

వీధి వ్యాపారుల కోసం తీసుకువచ్చిన 'పీఎం స్వనిధి యోజన' లక్షలాది మంది మహిళలకు ఉపయోగపడుతోందని మోదీ పేర్కొన్నారు. దీని ద్వారా దాదాపు 46 శాతం మంది మహిళలు తమ వ్యాపారాలను విస్తరించుకుంటూ.. ఆదాయాన్ని పెంచుకుంటున్న అంశాన్ని గుర్తు చేశారు.

**ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం**

ప్రధాని మోదీకి మరో అరుదైన గౌరవ పురస్కారం లభించింది. ఉజ్బెకిస్థాన్ అత్యున్నత 'ఒలియ్ దరాజాలి దస్లిక్' పురస్కారాన్ని అందుకున్నారు. ఆ దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఆయనకు అవార్డు మిగతా 02లో

## 'మంత్రి' పదవుల
# ముసలం

పదవుల కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేల లాబీయింగ్

- రేవంత్ నాయకత్వంపై అసమ్మతి స్వరాలు
- కొత్తగా వచ్చిన నేతలకు పదవులపై అసంతృప్తి..
- అసమ్మతితో కాంగ్రెస్‌కు కొత్త చిక్కులు
- అధిష్ఠానం దృష్టికి అంతర్గత విభేదాలు

రేవంత్‌కు ఎమ్మెల్యేల సెగ

**ముద్ర డెస్క్:** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి పదవుల వ్యవహారం కొత్త ముసలానికి దారితీస్తోంది. అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తికాకముందే పలువురు ఎమ్మెల్యేలు, నేతలు మంత్రి పదవుల కోసం తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్నట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. ఇప్పటికే మంత్రులుగా ఉన్న జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి పార్టీలోకి ఆలస్యంగా వచ్చినప్పటికీ కీలక శాఖలు దక్కడంపై కొంత మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అంతర్గతంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరిన జూపల్లి, పొంగులేటి వంటి నేతలకు ఆర్థిక, రాజకీయ బలం ఉండటంతో టికెట్లు దక్కడం, అనంతరం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి పదవులు రావడం పాత కాంగ్రెస్ నేతల్లో కొందరికి మింగుడుపడటం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వద్ద రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల వంటి కీలక శాఖలు, జూపల్లి కృష్ణారావు వద్ద ఎక్సైజ్ శాఖ ఉండటంపై పార్టీలో చర్చ సాగుతోంది.



**రేవంత్ ఎదుగుదలపై అసూయ?**

అయితే కాంగ్రెస్‌లోని ప్రస్తుత అసంతృప్తికి పదవుల పంపకాలే ఏకైక కారణం కాదని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణలో కాంగ్రెస్‌కు కొత్త ఊపు వచ్చిందని, పార్టీని ఎన్నికల విజయానికి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారని ఆ పార్టీ నేతలు గుర్తుచేస్తున్నారు. బీఆర్ఎస్ బలంగా ఉన్న సమయంలో కాంగ్రెస్‌ను ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టడంలో రేవంత్ నాయకత్వం పనిచేసిందనే అభిప్రాయం ఉంది. అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్‌రెడ్డికి పార్టీలో, ప్రభుత్వంలో లభిస్తున్న ప్రాధాన్యత కొంత మంది ఎమ్మెల్యేలు, నేతల్లో అసంతృప్తికి కారణమవుతోందనే ప్రచారం జరుగుతోంది. తమకూ మంత్రి పదవులు దక్కాలని పలువురు బహిరంగంగానో, అంతర్గతంగానో డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

**మంత్రి పదవుల కోసం తీవ్ర ప్రయత్నాలు**

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, అద్దంకి దయాకర్‌తో పాటు మరికొందరు నేతలు మంత్రి పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గతంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సైతం మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో చివరకు కాంగ్రెస్‌కు దూరమయ్యారనే చర్చ ఉంది. మంత్రి పదవుల కోసం సాగుతున్న పోటీ క్రమంగా నాయకత్వంపై విమర్శలకు దారితీస్తోందని పార్టీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఎమ్మెల్యేలు, నేతల మధ్య విభేదాలు మరింత ముదిరితే ప్రతిపక్ష మిగతా 02లో

# నేపాల్‌కు పెను సవాల్

రూ. 4.4 లక్షల కోట్లు ఉంటేనే సాధారణ స్థితికి నేపాల్

- అంతర్జాతీయ సాయం కోసం ఎదురుచూపులు
- ధ్వంసమైన రహదారులు, విద్యుత్ ప్రాజెక్టులు

*భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో ఛిన్నాభిన్నమైన నేపాల్‌ను తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడం ఆ దేశానికి పెను సవాలుగా మారింది. మౌలిక వసతులు, విద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతిని దేశ జీడీపీలో 10 శాతానికి పైగా (రూ. 4.4 లక్షల కోట్లు) నష్టం వాటిల్లడంతో, పునర్నిర్మాణ పనుల కోసం నేపాల్ ప్రభుత్వం ప్రస్తుతం అంతర్జాతీయ సమాజంతో పాటు ప్రపంచ బ్యాంక్, ఏడీబీ సాయం కోసం ఎదురుచూస్తోంది.* -ముద్ర డెస్క్ :

04



# స్కూళ్లలో కొత్త రూల్

- ఇక మార్కులు వాళ్లు వేయరు.!
- ప్రభుత్వ స్కూళ్లలో క్రాస్ వాల్యుయేషన్
- వేరే స్కూల్ టీచర్లతో దిద్దుబాటు
- మండల కేంద్రాల్లో ప్రత్యేక వాల్యుయేషన్ సెంటర్లు
- మార్కుల్లో పారదర్శకతే లక్ష్యం

02




## ఎంత నీచానికైనా
# దిగజారుతావ్

- పదవుల కోసం, పైసల కోసం నీ పాకులాట
- రాజకీయ పబ్బం గడుపుకునేందుకు అబద్ధాలు
- ధరణి పేరుతో జరిగిన దోపిడీని బయటకు తీస్తాం
- బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై మంత్రి పొంగులేటి ఫైర్

03





## 1643 మందిని కాపాడిన ప్రిన్సిపాల్

నేపాల్ వరదల్లో అసాధారణ సాహసం

టీచర్ రాజేంద్ర దవాడికి ప్రశంసల వెల్లువ

02



02

## 30 ఏళ్ల కల
# సాకారం

రేపు వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్ 1 ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు..

## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 31.08.2026
www.mudranews.in | @mudranews



ఎప్పుడూ అలసటగా అనిపిస్తోందా?


పెద్దగా శ్రమ చేయకపోయినా నీరసం, బలహీనత, తల తిరగడం ఉంటే B12 లోపం కారణం కావచ్చు.



## స్కూళ్లలో కొత్త రూల్..

**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యా ప్రమాణాలను సరిగ్గా అంచనా వేసేందుకు విద్యాశాఖ ఒక సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది. ఇకపై స్కూళ్లలో జరిగే పరీక్షల జవాబు పత్రాలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులే దిద్దే పాత పద్ధతికి స్వస్తి పలకనున్నారు. మూల్యాంకన ప్రక్రియలో నిష్పక్షపాత వైఖరిని పెంపొందించడం, పారదర్శకతను పెంచడం, విద్యార్థుల నిజమైన ప్రతిభను గుర్తించడమే లక్ష్యంగా 'క్రాస్ వాల్యుయేషన్' విధానాన్ని అధికారికంగా అమలు చేయనున్నారు.

**వేరే ఉపాధ్యాయులతో మూల్యాంకనం – పక్షపాతానికి చెక్**
కొత్తగా రూపుదిద్దుకున్న ఈ నిర్ణయం ప్రకారం, 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించే SA-1, SA-2 పరీక్షల జవాబు పత్రాలతో పాటు, 10వ తరగతి SA-1 పరీక్షల పేపర్లను సదరు పాఠశాల ఉపాధ్యాయులు మూల్యాంకనం చేయరు. వాటి స్థానంలో వేరే పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులతో జవాబు పత్రాలను దిద్దిస్తారు. సాధారణంగా తమ వద్ద చదివే విద్యార్థుల పేపర్లు దిద్దేటప్పుడు ఉపాధ్యాయుల వైపు నుంచి కొంత పక్షపాతం లేదా మార్కుల కేటాయింపులో హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉంది. ఈ కొత్త విధానం ద్వారా అలాంటి పొరపాట్లకు అడ్డుకట్ట పడటమే కాకుండా, విద్యార్థి రాసిన సమాధానాలకు తగిన ప్రామాణిక మార్కులు మాత్రమే లభిస్తాయి.

**మండల కేంద్రాల్లో ప్రత్యేక మూల్యాంకన కేంద్రాలు**
ఈ క్రాస్ వాల్యుయేషన్ వ్యవస్థను క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేక వాల్యుయేషన్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో పనిచేసే ఈ కేంద్రాలకు ఇతర పాఠశాలల ఉపాధ్యాయులను డ్యూటీపై కేటాయించి మూల్యాంకనం పూర్తి చేస్తారు.

**విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది**
ఈ నూతన విధానం వల్ల మూల్యాంకనంలో పారదర్శకత పెరగడంతో పాటు బోధన విషయంలో ఉపాధ్యాయులలోనూ మరింత జవాబుదారీతనం పెరుగుతుంది. అంతేకాకుండా, నిష్పక్షపాతంగా వచ్చే ఈ ఫలితాల ఆధారంగా ప్రతి విద్యార్థి యొక్క అసలైన విద్యా సామర్థ్యాలను, వారిలోని బలహీనతలను స్పష్టంగా గుర్తించవచ్చు. దానికి అనుగుణంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన, రెమెడియల్ తరగతులు నిర్వహించి వారిని చదువులో ముందుకు నడిపించేందుకు ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడనుంది. మొత్తానికి తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల నాణ్యతను పెంచే దిశగా విద్యాశాఖ తీసుకున్న ఈ నిర్ణయం ఒక మైలురాయిగా నిలవనుంది.



## డ్రగ్స్ పై అవగాహన కల్పించండి

**(మొదటి పేజీ తరువాయి)**
అందజేశారు. ది మోదీకి లభించిన 36వ అంతర్జాతీయ పురస్కారం. ఈ అవార్డు అందుకోవడం గర్వంగా ఉందని..దీనిని ఇరుదేశాల మధ్య ఉన్న శాశ్వత బంధానికి అంకితం చేస్తున్నారని ప్రధాని పేర్కొన్నారు. యురేనియం సరఫరా కోసం భారత్–ఉజ్బెకిస్థాన్ దీర్ఘకాలిక ఒప్పందాన్ని చేసుకోనున్నట్లు ప్రకటించారు. మరిన్ని ఒప్పందాలపైనా చర్చలు జరుపుతున్నామన్నారు .

# ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్ కు పునరుజ్జీవం

**(మొదటి పేజీ తరువాయి)**
**148 మీటర్లకు బదులు 152 మీటర్లు**
గత ప్రభుత్వం 2016లో అంగీకరించిన 148 మీటర్ల స్థాయికి బదులుగా 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర సమ్మతి పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అదనంగా రెండు మీటర్ల ఎత్తు పెంచడం వల్ల తెలంగాణకు నీటి వినియోగం, తరలింపు విషయంలో గణనీయమైన సాంకేతిక ప్రయోజనం ఉంటుందని చెప్పారు. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (CWPRS) అధ్యయనాల ప్రకారం.. 148 మీటర్ల వద్ద మహారాష్ట్రలో సుమారు 1,150 ఎకరాలు, 152 మీటర్ల వద్ద 2,500 ఎకరాలకు పైగా ముంపునకు గురయ్యే అవకాశం ఉందని వివరించారు. ముంపు అంశంపై మహారాష్ట్రతో చర్చలు తప్పనిసరి అయిన నేపథ్యంలో తెలంగాణకు అత్యధిక ప్రయోజనం కలిగించే 152 మీటర్ల స్థాయిపై గతంలోనే సమర్థంగా చర్చించాల్సి ఉందన్నారు.

**80 టీఎంసీలు గ్రావిటీతోనే..**
తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే దాదాపు 80 టీఎంసీల ప్రాణహిత నీటిని గురుత్వాకర్షణతో సుందిళ్ల వరకు తరలించవచ్చని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. భారీ ఎత్తిపోతల వ్యవస్థలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గడంతో విద్యుత్ వినియోగం, నిర్వహణ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. గ్రావిటీ ఆధారిత నీటి తరలింపు వల్ల సాగునీటి వ్యవస్థ ఆర్థికంగా మరింత స్థిరంగా మారుతుందని చెప్పారు.



**16.40 లక్షల ఎకరాలే అసలు లక్ష్యం**
ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి పథకం తొలుత 16.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో రూపొందిందని మంత్రి తెలిపారు. ప్రాజెక్టు పునరాకల్పన, పునర్వ్యవస్థీకరణలో అసలు ఆయకట్టులోని అనేక ప్రాంతాలు సాగునీటి ప్రయోజనాలను కోల్పోయాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఎగువ ప్రాంతాల్లో దాదాపు 2 లక్షల ఎకరాలకు సమర్థమైన సాగునీటి వనరు లేకుండా పోయిందన్నారు. ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాల్లోని చివరి ఆయకట్టు ప్రాంతాలు కూడా అసలు ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయని చెప్పారు.

**ఆయకట్టు పునరుద్ధరణకు ప్రాణహిత పునరుజ్జీవనం**
ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న ప్రాణహిత పునరుజ్జీవన ప్రణాళిక కేవలం తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికే పరిమితం కాదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదిలాబాద్, మెదక్, రంగారెడ్డి ప్రాంతాల్లో గతంలో ప్రతిపాదించిన సాగునీటి ప్రయోజనాలను తిరిగి అందించడమే విస్తృత లక్ష్యమని తెలిపారు. 1975, 1978 నాటి అంతర్రాష్ట్ర ఒప్పందాలు ప్రాణహిత ప్రతిపాదనకు న్యాయ, సంస్థాగత పునాదిగా ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణకు న్యాయబద్ధంగా దక్కాల్సిన నదీజల ప్రయోజనాల విషయంలో రాజీపడబోమని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 ఢిల్లీ భేటీలో 152 మీటర్ల ప్రతిపాదనపై మహారాష్ట్రతో చర్చలు జరిపి, తెలంగాణ ప్రయోజనాలను గరిష్ఠంగా సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నించనుంది. భారీ ఎత్తిపోతలపై ఆధారాన్ని తగ్గిస్తూ.. విద్యుత్ వ్యయాన్ని ఆదా చేసి.. గరిష్ఠ ఆయకట్టుకు సాగునీరు అందించడమే ప్రాణహిత పునరుజ్జీవన లక్ష్యమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.




# 30 ఏళ్ల కల సాకారం

**ముద్ర, అమరావతి:**
సీఎం నారా చంద్రబాబు నాయుడు సోమవారం మార్కాపురం జిల్లాలో పర్యటించనున్నారు. దశాబ్దాలుగా తీవ్ర కరువును ఎదుర్కొంటున్న మార్కాపురం జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి ప్రారంభించి, నీటిని విడుదల చేయనున్నారు. వెలిగొండ ప్రాజెక్టుతో మార్కాపురం ప్రాంతంతో పాటు ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు ప్రభావిత ప్రాంతాలకు కొత్త జీవం లభించనుంది. ముఖ్యంగా 30 ఏళ్ల క్రితం, 1996, మార్చి 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు, మూడు దశాబ్దాల తర్వాత అదే ప్రాజెక్టు తొలి దశను స్వయంగా ప్రారంభించడం చారిత్రక ఘట్టంగా నిలవనుంది. 'వెలిగొండ జలసిరులు–అభివృద్ధికి రెక్కలు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తోంది.

**కరవు నేలకు కృష్ణమ్మ జలాలు..**
తీవ్ర వర్షాభావం, అడుగంటిన భూగర్భ జలాలు, ఫ్లోరైడ్ సమస్యలు, సాగునీటి కొరతతో దశాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ ప్రాంతానికి వెలిగొండ కేవలం ఒక ఇరిగేషన్ ప్రాజెక్టు మాత్రమే కాదు... ఆ ప్రాంత భవిష్యత్తును మార్చే జీవనాధార ప్రాజెక్టు. శ్రీశైలం జలాశయం నుంచి గ్రావిటీ ద్వారా కృష్ణా జలాలను తరలించి నల్లమలసాగర్‌లో నిల్వ చేసి, ప్రధాన కాలువల ద్వారా సాగు, తాగు నీటి అవసరాలకు వినియోగించేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన 30 మండలాల ప్రజలకు ప్రయోజనం కలగనుంది. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలతో సహా సుమారు 23 లక్షల మందికి తాగునీటి ప్రయోజనం చేకూరనుంది.

**తొలిదశతో కొత్త అధ్యాయం..**
తొలి దశ ప్రారంభం ద్వారా 10.70 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు విడుదల చేయనున్నారు. తొలి విడతలో సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వెలిగొండ జలాలు అందుబాటులోకి రావడం ద్వారా వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. సాగునీటి భద్రత పెరగడంతో పంటలపై అనిశ్చితి తగ్గి, పంటల వైవిధ్యీకరణకు అవకాశం ఏర్పడుతుంది. భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గడంతో పాటు ఉద్యానవనం, అగ్రో ప్రాసెసింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలు అభివృద్ధి చెందేందుకు అవకాశాలు పెరుగుతాయి. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడి, వలసలకు అడ్డుకట్ట పడనుంది.



**30 ఏళ్ల ప్రయాణం..**
**సంకల్పం నుంచి సాకారం వరకు..**
1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు ప్రయాణంలో ఎన్నో సాంకేతిక, ఆర్థిక, నిర్మాణపరమైన సవాళ్లు ఎదురయ్యాయి. సొరంగాల నిర్మాణం, ఫీడర్ కాలువలు, హెడ్ రెగ్యులేటర్లు, భూసేకరణ, పునరావాసం వంటి క్లిష్టమైన అంశాలను అధిగమిస్తూ ప్రాజెక్టు పనులు ముందుకు సాగాయి. 2024లో కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన అనంతరం వెలిగొండను అత్యంత ప్రాధాన్యతా ప్రాజెక్టుగా తీసుకుని పనులను వేగవంతం చేసింది.
టన్నెల్ పనులు, ఫీడర్ కాలువలు, హెడ్ రెగ్యులేటర్లు, ఇతర అనుబంధ నిర్మాణాలతో పాటు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం, పరిహారం చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించింది. కేవలం 48 రోజుల వ్యవధిలో నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల మేర పరిహారం చెల్లింపులు జరపడం ద్వారా పనులకు వేగం తీసుకువచ్చింది. అంతేకాకుండా గెజిట్, జాబితాలో పేర్లు లేని వారికోసం మరో రూ.169 కోట్లు, 2019 తర్వాత 18 ఏళ్ల నిండిని వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. 'శంకుస్థాపన చేసింది చంద్రబాబు... ప్రారంభిస్తున్నదీ చంద్రబాబే' అన్న అరుదైన చారిత్రక ఘట్టానికి ఆగస్టు 31వ తేదీ వేదిక కానుంది. 30 ఏళ్ల క్రితం చేసిన సంకల్పం ఇప్పుడు సాకారమవుతుండటం మార్కాపురం ప్రాంత ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

**ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్..**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ఉదయం 9.30 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి, ఉదయం 10.15 గంటలకు మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవానిపల్లి హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర ప్రముఖులు ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతారు. ఉదయం 10.25 గంటలకు రోడ్డు మార్గంలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ వేదికకు చేరుకుంటారు. ఉదయం 10.35 గంటల నుంచి 11.20 గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి.. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్–1ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ పైలాన్ ఆవిష్కరిస్తారు. అనంతరం ప్రాజెక్టు గేట్లను ప్రారంభించి వెలిగొండకు కృష్ణా జలాల విడుదల కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఉదయం 11.30 గంటలకు గంటవానిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడ ప్రజా వేదిక సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. సభ అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు తిరుగు ప్రయాణమై మధ్యాహ్నం 2.15 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు.

## 1643 మంది స్టూడెంట్లను కాపాడిన ప్రిన్సిపాల్

**ముద్ర డెస్క్ :**
ఆయన విద్యాలయంలో పాటలు చెబుతున్నారు. విద్యార్థులు కూడా శ్రద్ధగా ఆ పాఠాలు వింటున్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు చెప్పడంలో ఆ ప్రిన్సిపాల్ తీరు వేరు. అందువల్లే ఆయనను అందరు విద్యార్థులు ప్రేమిస్తుంటారు. తండ్రి లాగా భావిస్తూ ఉంటారు. ఆ ప్రిన్సిపాల్ కూడా విద్యార్థులను తన సొంత పిల్లల మాదిరిగా చూసుకుంటూ ఉంటారు. అటువంటి ఆ విద్యాలయం ఒకసారిగా ఆటుపోట్లకు గురైంది. గందరగోళం బారిన పడింది. భూకంపాలకు నెలవైన తమ ప్రాంతం అలా అవుతుందని ఆ విద్యార్థులు ఊహించలేదు. ఆ ప్రిన్సిపాల్ కనీసం అంచనా కూడా వేయలేదు. అంతేకాదు వరద ప్రవాహం దూకుడుగా వస్తుంటే ఆ ప్రిన్సిపాల్ మరో మాటకు తావు లేకుండా సమయస్ఫూర్తి ప్రదర్శించారు. ఆయన చూపించిన తెగువ ఇప్పుడు యావత్ ప్రపంచం అభినందించేలా చేస్తోంది.



నేపాల్ దేశంలో త్రిభువన్ త్రిశూలి అనే పేరుతో ఒక స్కూల్ ఉంది. ఈ స్కూల్ కు ప్రిన్సిపల్ గా రాజేంద్ర దవాడీ కొనసాగుతున్నారు. ఆయన ఆరోజు స్కూల్లో పాఠాలు చెబుతున్నారు. ఇంతలోనే రాజేంద్ర కు ఫోన్ వచ్చింది. అది అతడి స్నేహితుడు చేశాడు. ఆ ఫోన్ కాల్ వినగానే రాజేంద్ర కు చెమటలు పట్టాయి. వెంటనే మరో మాటకు తావు లేకుండా స్కూల్లో పనిచేసే అటెండర్ కు సమాచారం ఇచ్చాడు. వెంటనే గంట కొట్టించాడు. క్షణాల కాలంలోనే గాజులను మొత్తం ఖాళీ చేయించాడు. అక్కడితోనే ఆగిపోలేదు.. విద్యార్థులందరినీ సమీపంలో ఉన్న కొండపైకి తీసుకొచ్చాడు. విద్యార్థుల కొండపైకి వెళ్లారో లేదో.. అప్పటికే వరద నీరు దూసుకు రావడంతో ఆ పాఠశాల మొత్తం కొట్టుకుపోయింది. అయితే ఈ వరద గురించి తెలియక ఒక టీచర్.. మరో ఉద్యోగి నీళ్లలో కొట్టుకుపోయి చనిపోయారు. దాదాపు 1643 మంది విద్యార్థులను రాజేంద్ర కాపాడారు. విద్యార్థులు కొండపైకి వెళ్ళిన తర్వాత.. వరద ప్రవాహం దూసుకు రావడంతో పాఠశాల కొట్టుకుపోయింది. కళ్ళముందు పాఠశాల కొట్టుకుపోతున్న నేపథ్యంలో రాజేంద్ర కన్నీటి పర్యంతమయ్యారు. విద్యార్థులను చూసి భావోద్వేగానికి గురయ్యారు. పాఠశాల కొట్టుకుపోతుంటే విద్యార్థులు కూడా విలపించారు. ఇన్ని రోజులపాటు తమకు విద్యార్థులు నేర్పించిన పాఠశాల కొట్టుకుపోవడం పట్ల విద్యార్థులు తీవ్రంగా దుఃఖించారు.
సమయానికి రాజేంద్ర సమయస్ఫూర్తి ప్రదర్శించారు. విద్యార్థులను కొండపైకి తీసుకెళ్లారు. వారికి ఆపదను దూరం చేశారు. వరద నీటిలో కొట్టుకుపోకుండా కాపాడగలిగారు. ఒక రకంగా ఆ విద్యార్థులందరికీ పునర్జన్మను ప్రసాదించారు. అందువల్లే ఆ విద్యార్థులు బతికి బట్ట కట్ట కలిగారు. ఒకవేళ ఆ ప్రిన్సిపల్ అలా చేయకుండా ఉండి ఉంటే.. ఆ సమయానికి ఆయన ఫ్రెండ్ ఫోన్ గనుక చేయకపోయి ఉంటే.. ఈపాటికి ఆ విద్యార్థులు మొత్తం జల సమాధి అయ్యేవారు.

## 'మంత్రి' పదవుల ముసలం

**(మొదటి పేజీ తరువాయి)**
బీఆర్ఎస్, బీజేపీలకు అది రాజకీయ ఆయుధంగా మారే అవ కాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

**మాట్లాడితేనే ముసలం సద్దుమణిగేనా?**
కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు కొత్తేమీ కాకపోయినా.. తెలంగాణలో అధికార పార్టీగా ఉన్న సమయంలో అసమ్మతి బహిరంగ రూపం దాల్చడం పార్టీకి ఇబ్బందికరంగా మారుతోంది. ముఖ్యంగా కొంతమంది ఎమ్మెల్యేలు పదవుల కోసం పక్క చూపులు చూడటం పార్టీ భవిష్యత్‌పై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. రేవంత్‌రెడ్డి బలమైన నాయకుడిగా ఎదిగిన నేపథ్యంలో ఆయన నాయకత్వాన్ని బలహీనపరిచేందుకు పార్టీలోని అసంతృప్తిని ప్రతిపక్షాలు ఉపయోగించుకునే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించాలంటే అసంతృప్త నేతలు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేరుగా చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. పదవుల కోసం పోటీ.. నాయకత్వంపై అసమ్మతి.. ప్రతిపక్షాలకు అవకాశం ఈ 3 అంశాలు కలిస్తే తెలంగాణ కాంగ్రెస్‌కు రాజకీయంగా పెద్ద సవాలుగా మారే అవకాశం ఉందనే చర్చ ప్రస్తుతం పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

## తెలంగాణలో 42 రైల్వే స్టేషన్ల అభివృద్ధి: కిషన్ రెడ్డి



**ముద్ర న్యూస్, వికారాబాద్:**
రూ.27 కోట్లతో చేపట్టిన వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి (Kishan Reddy) పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణతో పాటు తెలంగాణలో 42 రైల్వే స్టేషన్ లు ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. రూ.27 కోట్లతో వికారాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చేపట్టినట్టు వివరించారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎస్కలేటర్, 2 లిఫ్టులు, క్యాంటీన్, దివ్యాంగులకు ఆధునిక వసతులు కల్పిస్తున్నమన్నారు. ఈ ఏడాది చివరి నాటికి పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. వికారాబాద్ అభివృద్ధికి రైల్వే కనెక్టివిటీ ఎంతో కీలకమని, ఆధునికీకరణ పనులు పూర్తయిన తర్వాత మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయని పేర్కొన్నారు.

## చేతులు, కాళ్లలో తిమ్మిరి వస్తోందా?

సూదులతో గుచ్చినట్లు అనిపించడం, మంట, మొద్దుబారడం వంటి సమస్యలు B12 లోపంతో రావచ్చు.



## ప్రతి కులానికి 'యూనిక్ కోడ్' కేటాయించాల్సిందే

**లేదంటే జనగణనను నిలిపివేయండి**
**ఓబీసీ జాతీయ సదస్సులో వక్తల డిమాండ్**
**శాస్త్రీయత లేకుంటే రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా**
**డిమాండ్లు పట్టించుకోకపోతే దేశవ్యాప్త ఉద్యమం: నేతల హెచ్చరిక**




**ముద్ర, న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణనలో కులగణనను తప్పని సరి చేయడంతో పాటు ప్రతి కులానికి ప్రత్యేకంగా 'యూనిక్ కోడ్' కేటాయించాలని పలువురు మేధావులు, రాజకీయ నేతలు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్త ఏకాభిప్రాయం కుదిరేవరకు జనగణన ప్రక్రియను నిలిపివేయాలని స్పష్టం చేశారు. ఆదివారం, తెలంగాణ భవన్ లో 'జనగణనలో కులగణన – ప్రతి కులానికి యూనిక్ కోడ్' అనే ప్రధాన డిమాండ్ తో ఓబీసీ జాతీయ సదస్సు జరిగింది. బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్, మాజీ ఐఏఎస్ టి. చిరంజీవులు, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి. కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రాజ్యసభ ఎంపీ విల్సన్, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, ఏఐసీసీ ఓబీసీ విభాగం చైర్మన్ అనిల్ జైహింద్, స్వరాజ్ ఇండియా నేత ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ రతన్ లాల్, ప్రొఫెసర్ సూరజ్ మండల్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగొని బాలరాజ్ గౌడ్, ఎస్ దుర్గయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ ఇవ్వకుండా కులగణన నిర్వహించడం శాస్త్రీయ పద్ధతి కాదని వక్తలు విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల తరహాలోనే ఓబీసీలతో పాటు జనరల్ వర్గాలకు కూడా విడివిడిగా ప్రత్యేక కాలమ్ లను ఏర్పాటు చేయాలన్నారు. డ్రాప్ డౌన్ మెనూ ద్వారా ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించిన తర్వాతే జనగణన ప్రక్రియను ప్రారంభించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

**రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా!**

శాస్త్రీయమైన ప్రణాళిక లేకుండా మొక్కుబడిగా జనగణన చేపడితే కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తున్న సుమారు రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా అవుతుందని డాక్టర్ సూరజ్ మండల్, ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ఎంపీ విల్సన్ హెచ్చరించారు. ప్రతి కులాన్ని ఖచ్చితంగా నమోదు చేసేలా పారదర్శక, శాస్త్రీయ విధానాన్ని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకుండా మొండిగా ముందుకెళ్తే దేశవ్యాప్తంగా విస్తృత ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.

## వెయ్యి రోజుల పాలన.. సంక్షేమం-అభివృద్ధికి సమ ప్రాధాన్యం



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇచ్చామని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆర్థిక సవాళ్లు ఎదురైనా ప్రజా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధికి పునాదులు వేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు నెలకు ఆరు కిలోల సన్నబియ్యం, అర్హులకు కొత్త రేషన్ కార్డులు, స్మార్ట్ రేషన్ కార్డుల విధానం అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలతో కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించామని చెప్పారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని ఉత్తమ్ తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి సుమారు 25 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని, రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేల సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా వెయ్యి రోజుల పాలనలో దాదాపు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. నైపుణ్యాభివృద్ధి, మెరుగైన విద్య కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల వంటి కార్యక్రమాలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందన్నారు. అదే సమయంలో నీటిపారుదల ప్రాజెక్టులు, రహదారులు, పట్టణ మౌలిక వసతులు, హైదరాబాద్ అభివృద్ధితో పాటు కులగణన, ఎస్సీ వర్గీకరణ వంటి సామాజిక న్యాయ కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. "వెయ్యి రోజులు ఒక మైలురాయి మాత్రమే. సంక్షేమాన్ని మరింత విస్తరించి, అభివృద్ధిని వేగవంతం చేయడమే ముందున్న లక్ష్యం. ఆర్థిక సవాళ్లు ఎన్ని ఉన్నా ప్రజా సంక్షేమం విషయంలో వెనుకడుగు వేయం" అని ఆయన స్పష్టం చేశారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ..

**- 50 తులాల బంగారు ఆభరణాలు మాయం**



**ముద్ర న్యూస్, నిజామాబాద్ :** నిజామాబాద్ జిల్లా మాక్లూరు మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున చోరీకి పాల్పడ్డారు. 50 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. వివరాల్లో వెళ్లితే.. గ్రామానికి చెందిన శ్రీనివాస్ రావు రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుటుంబసభ్యులతో కలిసి నాలుగురోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండుగులు శ్రీనివాస్ రావు ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటి తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు ఉదయం ఇంటి యజమానికి సమాచారం అందించారు. బీరువాలో ఉన్న 50 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.10వేల నగదు చోరీ అయ్యానని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అనిల్ రెడ్డి పేర్కొన్నారు.

# ఎంత నీచానికైనా దిగజారుతావ్..

**పదవుల కోసం, పైసల కోసం నీ పాకులాట**
**రాజకీయ పబ్బం గడుపుకునేందుకు అబద్దాలు**
**ధరణి పేరుతో జరిగిన దోపిడీని బయటకు తీసాం**
**బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై మంత్రి పొంగులేటి ఫైర్**




**ముద్ర, హైదరాబాద్ :** పదవులు, డబ్బు కోసమే మాజీ మంత్రి హరీశ్ రావు ఎంత నీచానికైనా దిగజారి రాజకీయం చేస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీని కబ్జా చేసేందుకు చివరకు హరీశ్ రావు మరింతగా దిగజారిపోయారని దుయ్యబట్టారు. మామ కేసీఆర్ ఆరోగ్యం బాగుండకూడదని క్షుద్రపూజలు చేయించారని, ఈ విషయం స్వయంగా కేసీఆర్ కుమార్తె కవిత ప్రకటించారంటే, హరీష్ రావు వ్యక్తిత్వం ఎంత నీచమైనదో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇలాంటి తప్పుడు మనస్తత్వం కలిగిన వ్యక్తి కాబట్టే... తన అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు, రాజకీయ పబ్బం గడుపుకోవడానికి హరీష్ రావు ప్రతిరోజూ చేస్తున్న అసత్య ప్రచారాలను తెలంగాణ ప్రజలు నమ్మడం లేదన్నారు. ఆనాడు అగ్గిపెట్టె లేదంటూ యువకులను రెచ్చగొట్టి శవ రాజకీయాలు చేసిన హరీశ్ రావు.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పైసల కోసం మంత్రి పదవిని అడ్డుపెట్టుకొని అనైతికంగా ఆసుపత్రులతో పాల వ్యాపారం చేశారని ఆరోపించారు. ఈ మేరకు ఇవాళ ఎక్స్ వేదికగా మంత్రి విమర్శలు గుప్పించారు.మామ కేసీఆర్ పై క్షుద్రపూజల దగ్గర నుంచి పాల పేరుతో చేసిన పాపపు వ్యాపారాల దాకా అన్ని అవలక్షణాలు ఉన్న హరీశ్ రావు ఒక్కటి గుర్తుపెట్టుకో... ఎన్ని కుట్రలు చేసినా, ప్రతి రోజు పెయిడ్ సోషల్ మీడియాలో ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా ధరణి పేరుతో దొరలు చేసిన దోపిడీని బయటికి తీయడం ఖాయం అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి, పేదల సొంతింటి కలను నెరవేర్చడంతో పాటు గుడిసెలు లేని తెలంగాణను నిర్మించడం కూడా ఖాయం అన్నారు. హరీశ్ రావు నీ కుట్రలు, ప్రజలకు మంచి చేయాలనే గొప్ప పరిపాలన అందించాలనే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని అడ్డుకోలేవన్నారు.

## పొలం గట్టున శ్రమజీవులతో భట్టి విక్రమార్క ఆత్మీయ పలకరింపు



**ముద్ర, ఖమ్మం:** బోనకల్ మండలం రాయన్నపేట శివారుల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదివారం శ్రమజీవులను ఆత్మీయంగా పలకరించారు. సుడిగాలి పర్యటనలో భాగంగా పంట పొలాల్లో పనిచేస్తున్న మహిళా కూలీల వద్దకు వెళ్లి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకోగా, సన్న బియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం తమ కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని మహిళలు తెలిపారు. సంక్షేమ పథకాలతో తమ జీవితాల్లో మార్పు వచ్చిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి వాటిని తీర్చడమే ప్రజా ప్రభుత్వ బాధ్యతని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకానికి ఆయా శాఖలకు ఆర్థిక శాఖ క్రమం తప్పకుండా నిధులు విడుదల చేస్తోందని తెలిపారు.

## నర్సు మృతి కేసులో నిందితుడి అరెస్ట్

**ముద్ర, హైదరాబాద్:** పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నర్సు (21) అనుమానాస్పద మృతి కేసులో పోలీసులు పురోగతి సాధించారు. బిహార్‌కు చెందిన సైనా ఉల్లా అనే వ్యక్తి అత్యాచారానికి యత్నించి, ఆమె ప్రతిఘటించడంతో గొంతు నొక్కి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడు రియల్ ఎస్టేట్ సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. నేరం అంగీకరించిన అనంతరం అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాల రద్దీ

హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. వరుస సెలవుల నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు నగరానికి తిరిగి వస్తున్నారు. దీంతో హైవేపై వాహనాలు నెమ్మదిగా ముందుకు కదులుతున్నాయి. మరోవైపు వరంగల్–హైదరాబాద్ రహదారిపై సైతం రద్దీ ఉంది.

# నగరం నడిబొడ్డున కాంగ్రెస్ భారీ భూ కుంభకోణం..

**రూ.500 కోట్ల భూములపై హరీశ్ రావు సంచలన ఆరోపణలు**
**రూ.500 కోట్ల భూములు రూ.87 కోట్లకేనా?**
**ప్రభుత్వ భూములను ప్రైవేట్‌కు కట్టబెడుతున్నారు**
**ఆయిల్‌ఫెడ్ భూముల వ్యవహారంలో కొత్త వివాదం..**
**భూ కేటాయింపులపై హరీశ్ తీవ్ర విమర్శలు**
**సీఎం రేవంత్‌కు హరీశ్ లేఖ**




**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరం నడిబొడ్డున మరో భారీ భూ కుంభకోణానికి కాంగ్రెస్ సర్కార్ తెరలేపిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు సంచలన ఆరోపణలు చేశారు. ఆర్టీసీ క్రాస్ రోడ్, అజామాబాద్‌లో తెలంగాణ ఆయిల్‌ఫెడ్‌కు చెందిన రూ.500 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రేవంత్ సర్కార్ రూ.87 కోట్లకే ప్రైవేటు పరం చేయడానికి కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. నగరం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి ప్రభుత్వం సిద్ధమైందని ఆయన లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ తన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేకుంటే తాము పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. దశాబ్దాలుగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆస్తులను కమీషన్ల కోసం పాలకులు ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు.

ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన రేవంత్ సర్కార్.. రియల్ ఎస్టేట్ ఏజెన్సీగా మారిపోయింది. రూ.500 కోట్ల విలువ చేసే ఆయిల్‌ఫెడ్ భూములను కేవలం రూ.87 కోట్లకు ప్రైవేటు పరం చేయడానికి సిద్ధమైంది' అని హరీశ్ లేఖలో రాసుకొచ్చారు. ఆ సొమ్మును చెల్లించేందుకు ఆయిల్‌ఫెడ్ సిద్ధంగానే ఉందని, అయినా వారిని కాదని ప్రైవేటు వ్యక్తులకే భూములను ఇచ్చేందుకు ప్రభుత్వం ఎందుకు ఉత్సాహం చూపిస్తోందని ఆయన ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ ప్రైవేట్ శక్తులకు తలొగ్గకుండా వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తిని చిత్తశుద్ధితో కాపాడామని, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. పేదల పొట్టగొట్టి పెద్దలకు పల్లీలు, బఠాణీల్లా వేల కోట్ల రూపాయల భూములు పంచుతోందని ఘాటు విమర్శలు చేశారు. 1987లో సుప్రీంకోర్టు ప్రైవేట్ సంస్థకు మొట్టికాయలు వేసి ప్రభుత్వానిదే హక్కు అని తేల్చినా.. కమీషన్ల కోసం కాంగ్రెస్ నేతలు తీర్పులనే తుంగలోకి తొక్కారని ధ్వజమెత్తారు.ఒకవైపు సామాన్యుల ఇళ్లను 22A జాబితాలో పెట్టి వేధిస్తున్న ప్రభుత్వం.. మరోవైపు ఖరీదైన ప్రభుత్వ భూములను కమీషన్ల కోసం కారుచౌకగా ప్రైవేట్‌కు ధారాదత్తం చేస్తోందని ఫైరయ్యారు. ఇలా స్వార్థం కోసం ఇష్టారాజ్యంగా ఆస్తులు అమ్ముకుంటూ పోతే భవిష్యత్తులో గుడికి, బడికి, చివరికి శ్మశానానికి కూడా రాష్ట్రంలో స్థలం మిగలదని మండిపడ్డారు. తక్షణమే ముఖ్యమంత్రి ఈ అక్రమ కేటాయింపును రద్దుచేసి, ఆ భూమిని ఆయిల్‌ఫెడ్‌కే దక్కేలా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాలని హరీశ్‌రావు సూచించారు. ప్రజల సొత్తును ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, ఈ నిర్ణయం వెనక్కి తీసుకునే వరకు మహా పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# ఆసరా పెన్షన్ల పెంపుపై శుభవార్త..

**- దివ్యాంగులకు త్వరలో రూ.6 వేల పెన్షన్!**
**రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెన్షన్ పెంపు**
**పెన్షన్ పెంపుపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హామీ**




**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణలోని దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే భారీ శుభవార్త అందించనుంది. ప్రస్తుతం ఇస్తున్న ఆసరా పెన్షన్ మొత్తాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వెల్లడించారు. దివ్యాంగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే ప్రస్తుతం ఇస్తున్న 4,000 రూపాయల పెన్షన్‌ను 6,000 రూపాయలకు పెంచబోతున్నామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంపై ఎంతటి ఆర్థిక భారం ఉన్నప్పటికీ సంక్షేమ పథకాల అమలులో వెనక్కి తగ్గేది లేదని, అర్హులైన దివ్యాంగులందరికీ పెన్షన్లు సక్రమంగా అందుతాయని ఆయన భరోసా ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు దివ్యాంగుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని మంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 2014 మేనిఫెస్టోలో ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశారని, 2018లో అసలు దివ్యాంగుల అంశాన్నే పట్టించుకోలేదని విమర్శించారు. నిన్నటి సమావేశంలో హరీష్‌రావు పచ్చి అబద్ధాలు మాట్లాడారని, కేవలం ముఖ్యమంత్రిని తిట్టడమే లక్ష్యంగా దివ్యాంగుల సమావేశాన్ని ఏర్పాటు చేశారని మండిపడ్డారు. దివ్యాంగులను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్న హరీష్ రావుకు త్వరలోనే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రజా సమస్యలు ఏవైనా ఉంటే రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడాలని, ప్రతి శాఖ నుంచి సమాధానం ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ చేశారు.

తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించిందని మంత్రి తెలిపారు. రూ. 50 కోట్ల నిధులతో మోపెడ్ వాహనాలు, బ్యాటరీ వీల్ చైర్లను పంపిణీ చేశామని పేర్కొన్నారు. అంతేకాకుండా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో దివ్యాంగులకు ప్రత్యేక కోటాను ఏర్పాటు చేశామని చెప్పారు. పుట్టిన వెంటనే శిశువులకు ఏదైనా అంగవైకల్యం గుర్తిస్తే, 'బాల భరోసా' పథకం కింద ప్రభుత్వమే పూర్తి ఖర్చు భరించి కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత చికిత్స అందిస్తోందని వివరించారు. భవిష్యత్తులో దివ్యాంగులకు మరిన్ని పారదర్శకమైన సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

## మల్కాజిగిరి బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా గిరివర్ధన్ రెడ్డి ప్రమాణస్వీకారం

**ముద్ర, హైదరాబాద్:** మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్ జిల్లా బీజేపీ కార్యాలయాన్ని రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, ఎంపీ ఈటల రాజేందర్ ప్రారంభించారు. అనంతరం జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా గిరివర్ధన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా సీతారామచంద్ర స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. సభలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ బీజేపీ కుటుంబ పార్టీ కాదని, సిద్ధాంతాలకు కట్టుబడి దేశహితం కోసం పనిచేసే పార్టీ అని అన్నారు. కార్యకర్తలే పార్టీకి పునాదులని, నాయకులు ప్రజలు, కార్యకర్తలతో అనుబంధం పెంచుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ బలహీనపడితే ప్రజాస్వామ్యం, దేశ భద్రత బలహీనపడుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధిలో కేంద్రం అందిస్తున్న నిధులను కూడా ప్రజలకు వివరించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, మాటలతో కలిగే గాయాలు సులభంగా మానవని అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం యువత, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. 22ఏ సమస్యపై ఈటల రాజేందర్ చేస్తున్న పోరాటానికి మద్దతు తెలిపారు. సెప్టెంబర్ 5న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. నూతన జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శక్తిమేర పనిచేస్తానని, రాబోయే ఎన్నికల్లో మల్కాజిగిరిలో బీజేపీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షురాలు జయశ్రీ, కొల్లి మాధవి, రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు రవి నాయక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీజేపీ ఇంచార్జి రంగారెడ్డి, తాడూరి శ్రీనివాస్, కట్టా సుధాకర్, సుధాకర్ గాండే, పాపారావు, గోపురమణరెడ్డి, జెన్నపురెడ్డి సురేందర్ రెడ్డి, వికె మహేష్, శేఖర్, తిరుపతి యాదవ్, సుధ, భరత్, వాసు, సత్యపాల్, ఆర్

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
సోమవారం 31.08.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## ప్యాకేజ్డ్ ఫుడ్ పై లేబుల్..
# దీని అర్థం ఏంటి?




ఒకప్పుడు పిల్లలకు ఇంట్లో వండిన ఆహారం తప్ప ఎక్కడా ప్రత్యేకంగా దొరికేది కాదు. కొన్ని కిరాణం షాపుల్లో నిమ్మరసం చాక్లెట్లు.. పార్లేజీ బిస్కెట్లు.. మరి కొన్ని ప్రాంతాల్లో రసగుల్లాలు వంటివి లభించేవి. అయితే ఇవి పిల్లలను ఆకర్షించడంతోపాటు ఆరోగ్యాన్ని కూడా ఉంచేవి. కానీ ఇప్పుడు ప్రతి కిరాణంలో నిండుగా ప్యాకేజ్ ఫుడ్ కనిపిస్తున్నాయి. ఇవి పిల్లలను అయితే ఆకర్షిస్తున్నాయి కానీ.. అందులో స్పష్టమైన పోషకాహారాలు లేకపోవడమే కాకుండా ఆరోగ్యాన్ని పాడు చేసేలా ఉన్నాయని కొందరు ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కానీ తాత్కాలికంగా పిల్లలను ఆనందంగా ఉంచేందుకు తల్లిదండ్రులు సైతం వీటిని ఎంకరేజ్ చేస్తున్నారు. కానీ ఇటీవల ప్యాకేజీడు ఫుడ్ పై సుప్రీంకోర్టు హెచ్చరికలు జారీ చేసింది. ఇలాంటి వాటిపై కొన్ని రకాల లేబుల్స్ ఉంచాలని పేర్కొంది. అసలు ఈ లేబుల్స్ ఎలా ఉంటాయి. ముఖ్యంగా రెడ్ లేబుల్ ఉన్న ప్యాకేజ్డ్ తింటే ఏమవుతుంది?

ప్రపంచంలోని చాలా దేశాల్లో ప్యాకేజ్డ్ ఫుడ్ పైన ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. వీటిని కొనేటప్పుడు కేవలం రుచిని గురించి తెలుసుకుంటున్నారే తప్ప.. ఇందులో ఎలాంటి విధానాలు పాటించారని గ్రహించడం లేదు. దీనిపై ఉన్న కొన్ని గుర్తుల ప్రకారం ఇది ఏ రకమైనదో తెలుసుకోవచ్చు. అలాంటి 5 గుర్తులు.

**రెడ్:** ఒక ప్యాకేజ్ ఫుడ్ పై రెడ్ కలర్ లేబుల్ ఉంటే దీనిని మాంసాహార ఉత్పత్తులతో తయారు చేశారని అర్థం. శాఖాహారులు అయితే దీనిని తీసుకోకపోవడమే మంచిది.

**బ్లాక్:** ఈ రకమైన లేబుల్ ఉంటే ఇందులో పెద్ద మొత్తంలో కెమికల్స్ కలిసి ఉన్నాయని అర్థం అయితే వీటిని రుచిని పెంచడానికి కలిపారని ఆయా సంస్థలు తెలుపుతాయి. వీటిని పెద్ద మొత్తంలో తీసుకుంటే ఆరోగ్యానికి హానికరమని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. అందువల్ల ఇలాంటి వాటిని కొనేటప్పుడు ఆలోచించాలి.

**ఎల్లో:** ఇలాంటి లేబుల్ ఉన్న ఆహారం కోడిగుడ్డుతో తయారు చేసిందని అర్థం. ఎవరైనా ఈ పదార్థం నచ్చని వారు తీసుకోకపోవడం మంచిది.

**బ్లూ:** నీలం రంగు ఉన్న లేబుల్ ఆహారం నేరుగా కాకుండా వైద్యుల సలహా మేరకు మాత్రమే తీసుకోవాలని సూచిస్తున్నారు




ఫుడ్ పై రకరకాల లేబుల్స్ అంటించి ఉంటాయి. వీటిని గుర్తించి కావాల్సిన వాటిని తీసుకుంటూ ఉంటారు. అయితే మన దేశంలో కూడా ఇలాంటి స్పష్టమైన లేబుల్స్ ఉండాలని.. కోడింగ్ విధానాలు రావాలని ఆహార భద్రత నియంత్రణ సంస్థ గతంలోనే హెచ్చరించింది. అయితే తాజాగా ప్రజారోగ్య కార్యకర్తలు దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించగా లేబుల్ అంశాన్ని పరిశీలించాలని నియంత్రణ సంస్థలను ఆదేశించింది.

అయితే చాలామంది ఇంట్లో వండిన ఆహారం కంటే బయట దొరికే ప్యాకేజ్డ్

**గ్రీన్:** ఇలాంటి లేబుల్ ఉన్న ఆహారం పూర్తిగా శాఖాహారమని.. ఇది స్వచ్ఛంగా ఉంటుందని అర్థం. ఇందులో ఎలాంటి మాంసాహార పదార్థాలు లేకుండా తయారు చేశారని అర్థం.

ఈ విధంగా ప్యాకేజీలపై ప్రత్యేకంగా లేబుల్స్ అంటించాలని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం సుప్రీంకోర్టు దీనిపై ఆదేశాలు వచ్చిన నేపథ్యంలో ఆహార నియంత్రణ సంస్థ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# నేపాల్‌కు పెను సవాల్

### రూ. 4.4 లక్షల కోట్లు ఉంటేనే సాధారణ స్థితికి నేపాల్

**అంతర్జాతీయ సాయం కోసం ఎదురుచూపులు, ధ్వంసమైన రహదారులు, విద్యుత్ ప్రాజెక్టులు**

**జీడీపీలో 10 శాతానికిపైగా నష్టం**

భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు నేపాల్‌ను కోలుకోలేని రీతిలో దెబ్బతీశాయి. ప్రకృతి ప్రకోపానికి ఆ దేశంలోని పలు జిల్లాలు తీవ్రంగా ప్రభావితమవ్వగా.. ఆస్తి, ప్రాణ నష్టంతో పాటు మౌలిక వసతులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రవాణా, విద్యుత్, తాగునీటి వ్యవస్థలు ఛిన్నాభిన్నమవడంతో దేశాన్ని తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడం నేపాల్ ప్రభుత్వానికి ఒక పెను సవాలుగా మారింది.

ఈ విపత్తు నుంచి కోలుకోవడానికి.. వరద ప్రభావిత ప్రాంతాలను పూర్తిస్థాయిలో పునర్నిర్మించేందుకు సుమారు 4 నుంచి 5 బిలియన్ డాలర్లు అవసరమయ్యే అవకాశం ఉందని నేపాల్ ఆర్థిక మంత్రి స్వర్ణిమ్ వాగ్లే వెల్లడించారు. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ. 3.5 లక్షల కోట్ల నుంచి రూ. 4.4 లక్షల కోట్లకు సమానం. ఈ భారీ మొత్తం నేపాల్ మొత్తం ఆర్థిక వ్యవస్థ పరిమాణంలో దాదాపు 10 శాతానికి సమానం కావడం గమనార్హం. అయితే ఇది కేవలం ప్రాథమిక అంచనా మాత్రమేనని, వివిధ శాఖల అధికారులు.. నిపుణులు పూర్తిస్థాయి నష్ట తీవ్రతపై సమగ్ర అధ్యయనం చేపట్టిన తర్వాతే పునర్నిర్మాణానికి అయ్యే తుది వ్యయంపై స్పష్టత వస్తుందని ప్రభుత్వం తెలిపింది.

రవాణా వ్యవస్థ విధ్వంసమవ్వడం వల్ల నేపాల్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. వందల



కిలోమీటర్ల మేర రహదారులు కొట్టుకుపోవడంతో పాటు కీలక ప్రాంతాలను కలిపే అనేక వంతెనలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. దీనివల్ల అనేక జిల్లాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి, బాధితులకు సహాయక చర్యలు అందించడానికి కూడా అధికారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు నేపాల్‌కు అత్యంత కీలకమైన విద్యుత్ రంగానికి కూడా భారీ గండి పడింది. దేశంలోని పలు జలవిద్యుత్ కేంద్రాలు వరదల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్నాయి. పవర్ ప్లాంట్లతో పాటు ట్రాన్స్‌మిషన్ లైన్లు ధ్వంసమవ్వడంతో దేశ వ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తి మరియు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఇక మానవీయ కోణంలో చూస్తే వరదల కారణంగా వేలాది ఇళ్లు నీట మునిగిపోవడంతో అనేక కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. వేల సంఖ్యలో ప్రజలు తమ సర్వస్వాన్నీ కోల్పోయి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీరికి తక్షణమే తాత్కాలిక నివాస సదుపాయాలు కల్పించడంతో పాటు సురక్షిత తాగునీరు, ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడం.. దెబ్బతిన్న ఇళ్లను తిరిగి నిర్మించి ఇవ్వడం ప్రభుత్వానికి ప్రాధాన్య అంశం.

నేపాల్ వద్ద ఉన్న స్వదేశీ ఆర్థిక వనరులతో ఇంత భారీ మొత్తాన్ని సమీకరించడం సాధ్యం కాదు. దీంతో ఈ రీబిల్డింగ్ ప్రాసెస్ కోసం అంతర్జాతీయ సమాజం, ఆసియా అభివృద్ధి బ్యాంక్, ప్రపంచ బ్యాంక్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి నిధులు, రుణాల రూపంలో సహాయం కోరాల్సిన పరిస్థితి నేపాల్‌కు ఏర్పడింది. విపత్తు ధాటికి దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర మౌలిక వసతులను ఎంత త్వరగా పునరుద్ధరిస్తే నేపాల్ ఆర్థిక వ్యవస్థ అంత త్వరగా మళ్లీ పట్టాలెక్కే అవకాశముంది.

- ముద్ర డెస్క్ :

# తినే కోడిగుడ్డు నాణ్యమైనదా?

శరీర ఆరోగ్యానికి ప్రతిరోజు ఒక కోడిగుడ్డు తినాలని కొందరు వైద్యులు ప్రత్యేకంగా సూచిస్తున్నారు. అయితే నాణ్యమైన కోడిగుడ్డును తింటేనే ఆరోగ్యంగా ఉండగలుగుతారు. వీటిలో కల్తీ ఉంటే ఆరోగ్యానికి బదులు కొత్త రోగాలు వచ్చే అవకాశాలు ఉంటాయి. ప్రస్తుత కాలంలో చాలా గుడ్లు నాణ్యతలేనివిగా మార్కెట్లోకి వస్తున్నాయి. కొంతమంది ఇవి ఎలా ఉన్నాయో తెలుసుకోకుండానే వాటిని తింటున్నారు. అయితే ఇటీవల కోడిగుడ్డు నాణ్యంగా ఉందో లేదో 'వాటర్ టెస్ట్'ద్వారా తెలుసుకొని వాడుకోవాలని FSAI తెలిపింది. దీని ద్వారా గుడ్డు నాణ్యంగా ఉంటే మాత్రమే తీసుకోవాలని.. లేకుంటే వదిలేయాలని సూచించింది. అసలు ఈ టెస్ట్ ఎలా చేస్తారో తెలుసుకుందాం..

పౌష్టికాహారం తీసుకోవడం ఎంత ముఖ్యమో.. అవి నాణ్యంగా ఉన్నాయో? లేవో? తెలుసుకోవడం అంతే ముఖ్యం. ఇప్పుడున్న పరిస్థితుల్లో మార్కెట్లోకి వచ్చే చాలా వస్తువులు కల్తీగా మారిపోతున్నాయి. దీనిపై Food Safety and Standards Authority of India (FSSAI) ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూనే ఉంది. ఇందులో భాగంగా తాజాగా కోడిగుడ్డు కల్తీ పై ఆసక్తికర విషయాలను అందించింది. కోడుగుడ్డు నాణ్యంగా ఉందో? లేదో ?ఇలా టెస్ట్ చేసి ఆ తర్వాత మాత్రమే తీసుకోవాలని తెలిపింది.

కోడిగుడ్డును నీళ్లలో వేసి అది మంచిదో? కాదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం ఒక గ్లాసులో నీటిని తీసుకోవాలి. ఇందులో కోడి గుడ్డును నెమ్మదిగా వదిలేయాలి. ఇలా వదిలేసిన తర్వాత గుడ్డు ఎలా ఉంటుందో గమనించాలి. నీటిలో వేసిన గుడ్డు నాణ్యమైనది అయితే అడుగున వెళ్లి ఉంటుంది. కానీ కోడిగుడ్డు నాణ్యంగా లేకపోతే అది నీటిపైనే తేలియాడుతుంది. ఒకవేళ అడుగున వెళ్లి




నా కూడా ఇది నిటారుగా నిలబడుతుంది. దీంతో ఇది నాణ్యమైనది కాదు అని గుర్తించాలి. అయితే ఈ టెస్ట్ కోసం గాజు గ్లాస్ ని తీసుకోవడం వల్ల ఈజీగా గుర్తించవచ్చు. కొందరు కోడిగుడ్లను ఆఫ్ బాయిల్డ్ చేసి తింటారు. ఇలా తినడం వల్ల అందులో పాడైపోయిన రసాయనాలు ఉంటే అనారోగ్యానికి గురై అవకాశం ఉంటుంది. అంతేకాకుండా దీనిని పగలగొట్టినప్పుడు ఏదైనా ప్రత్యేక వాసన వస్తే దానిని దూరం పెట్టడమే మంచిది. సాధ్యమైనంతవరకు కొన్ని గుడ్లపై అనుమానం ఉంటే వాటిని పూర్తిగా బాయిల్డ్ చేసి తీసుకోవాలి. ఆఫ్ బాయిల్డ్ చేసుకోవాల్సి వస్తే దీని నాణ్యతను పరీక్షించాలి.

అయితే కొందరు మార్కెట్ నుంచి తీసుకువచ్చిన గుడ్లను ఎక్కువ రోజులు నిల్వ చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల కూడా ఇవి పాయిజన్ గా మారే అవకాశం ఉంటుంది. అందువల్ల ఎప్పటికప్పుడు వాడుకోవడం మంచిది అని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. వీటిని ఇంట్లో నిల్వ చేయాల్సి వస్తే సరైన ఉష్ణోగ్రతలో ఉంచడం మంచిది.

# శివలింగం, జ్యోతిర్లింగం మధ్య తేడా ఏమిటి?

మనం శివుడి పేరును తీసుకున్న వెంటనే, మన మనస్సులో ప్రశాంతమైన, గంభీరమైన, శక్తివంతమైన శివయ్య రూపం కనిపిస్తుంది కదా. శివుడిని వివిధ రూపాల్లో పూజిస్తారు. వాటిలో రెండు అత్యంత ప్రత్యేకమైన రూపాలు శివలింగం, జ్యోతిర్లింగం. చాలా మంది ఈ రెండింటినీ ఒకేలా భావిస్తారు. కానీ వాస్తవానికి వాటి మధ్య చాలా తేడా ఉంటుంది. మరి ఈ రెండింటి మధ్య తేడా ఏంటంటే?

శివలింగం అనేది నిరాకార శివుని రూపానికి చిహ్నం. దీన్ని మానవులు తయారు చేస్తారు. లేదా కొన్నిసార్లు ఒక ప్రదేశంలో స్వయంగా కనిపిస్తుంది. దీనిని దేవాలయాలలో ప్రతిష్టించి ప్రతిరోజూ పూజిస్తారు. మరోవైపు, జ్యోతిర్లింగాలు అంటే శివుడు అగ్ని లేదా కాంతి రూపంలో వ్యక్తమైన ప్రదేశాలు. వీటిని ప్రత్యేక ప్రదేశాలుగా పరిగణిస్తారు. దర్శనం చాలా పవిత్రంగా పరిగణిస్తారు.

### జ్యోతిర్లింగం అంటే ఏమిటి?

జ్యోతిర్లింగం అంటే శివుడు కాంతి రూపంలో కనిపించిన ప్రదేశం. 'జ్యోతి' అంటే వెలుగు, 'లింగం' అంటే గుర్తు లేదా చిహ్నం. ఈ ప్రదేశాలను శివుని దైవిక అవతార స్థలాలుగా పరిగణిస్తారు. పురాతన గ్రంథాలలో వీటి గురించి ప్రస్తావించారు. వాటిని పూజించే పద్ధతి కూడా ప్రత్యేకమైనది.

### దేశంలో 12 ప్రధాన జ్యోతిర్లింగాలు

1. సోమనాథ్ (గుజరాత్)
2. మల్లికార్జున్ (ఆంధ్రప్రదేశ్)
3. మహాకాళేశ్వర్ (ఉజ్జయిని)
4. ఓంకారేశ్వర్ (మధ్యప్రదేశ్)
5. కేదార్‌నాథ్ (ఉత్తరాఖండ్)
6. భీమశంకర్ (మహారాష్ట్ర)
7. కాశీ విశ్వనాథ్ (ఉత్తరప్రదేశ్)
8. త్రిమబ్ధకేశ్వర్ (జార్ఖండ్)
9. నాగేశ్వర్ (గుజరాత్)
10. రామేశ్వరం (తమిళనాడు)
11. ఘృష్ణేశ్వర్ (మహారాష్ట్ర)



### శివలింగ రకాలు

శివలింగాన్ని అనేక రూపాల్లో పూజిస్తారు. దానిలో అనేక రకాలు ఉన్నాయి

1. ఓవల్ శివలింగం – ఇది సాధారణ దేవాలయాలలో కనిపిస్తుంది. మానవులు తయారు చేస్తారు.
2. పరాడ్ శివలింగం – పాదరసంతో తయారు చేస్తారు. దీనిని పూజ కోసం ఇంట్లో కూడా ఉంచుతారు.
3. స్వయంభూ శివలింగం – ఒకే చోట దానంతట అదే కనిపిస్తుంది.
4. దేవ శివలింగం – దేవతలు స్థాపించారు.
5. అసుర్ శివలింగం – రాక్షసులు స్థాపించిన శివలింగం.
6. పురాణిక్ శివలింగం – పాత కథలలో ప్రస్తావించిన శివలింగం.
7. మనుష్య శివలింగం – మట్టి, రాయి, లోహం మొదలైన వాటితో సాధారణ ప్రజలు తయారు చేసిన శివలింగం.

శివలింగ పూజలో నీరు, పాలు, బేల్ పత్ర, ధాతుర, తెల్లని పువ్వులు అర్పిస్తారు. క్రమం తప్పకుండా పూజిస్తే, ఇంట్లో ఉంచుకోవచ్చు.






## క్రియేటర్లకు
# మంచి రోజులు

వ్యాపారంలో ఒకరికొకరి మధ్య పోటీ ఉండడం సహజం. ఎవరు ఎక్కువగా డబ్బు సంపాదిస్తారో? ఎవరు ఎక్కువగా సేల్స్ చేస్తారో.. వారినే విన్నర్ గా పరిగణించేవారు.. కానీ ఇప్పుడు ఆన్లైన్ సంస్థల మధ్య కూడా పోటీ నెలకొంది. అయితే ఈ పోటీ కేవలం డబ్బు కోసం కాకుండా ప్రేక్షకులు, క్రియేటర్ల కోసం కావడం గమనార్హం. ప్రముఖ ఆన్ లైన్ సంస్థలైన యూట్యూబ్, నెట్ఫ్లిక్స్ ఈ పోటీలో ముఖ్యులుగా నిలుస్తున్నాయి. ఓ షో విషయంలో క్రియేటర్ల కోసం ఈ రెండు కంపెనీలు పోటీ పడడం విశేషం. ఇంతకీ ఈ రెండు సంస్థల మధ్య పోటీ ఎందుకు ఏర్పడింది? అసలు ఏంటి కథ..?

యూట్యూబ్లో చిన్న స్థాయి నుంచి టాప్ లెవల్ లోకి వెళ్లినవారు ఎంతోమంది ఉన్నారు. అయితే ఇప్పటివరకు మీరు తమ క్రియేటివిటీని ఉపయోగించి యూట్యూబ్ ద్వారా ఆదాయాన్ని పొందారు. కానీ ఇప్పుడు ఈ క్రియేటర్లకు రెండు సంస్థలు పోటీ పడుతున్నాయి. Samay Raina కు చెందిన India's got latent సీజన్ వన్ ఇప్పటికే యూట్యూబ్ ద్వారా ప్రజా ధారణ పొందిన విషయం తెలిసిందే. దీని ద్వారా అధిక ఆదాయాన్ని కూడా పొందింది.. ఆ తర్వాత ఈ షో ను నెట్ఫ్లిక్స్ కూడా ప్రసారం చేసింది.

కానీ ఇప్పుడు లేటెస్ట్ గా రాబోయే సీజన్ 2 కోసం రెండు సంస్థలు పోటీ పడుతున్నాయి. ఇందులో భాగంగా యూట్యూబ్ తన టాప్ క్రియేటర్లకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఇప్పటికే మిలియన్ల కొద్దీ ఫాలోవర్స్ ఉన్న క్రియేటర్లకు మిలియన్ డాలర్ల డబ్బులు ఇచ్చి ఈ షోలో ఉండేలా చూసుకుంటున్నాయి. అయితే యూట్యూబ్లో ఇప్పటికే టాప్ లెవల్ లో ఉన్న క్రియేటర్ లను నెట్ఫ్లిక్స్ కొనుగోలు చేస్తుండగా.. వారిని వెళ్ళనీయకుండా యూట్యూబ్ కాపాడుకునే ప్రయత్నం చేస్తుంది. ఇందులో భాగంగా వీరికి ప్రత్యేకంగా ప్యాకేజీ అని ప్రకటిస్తోంది. ప్యాకేజీ మాత్రమే కాకుండా వివిధ రకాల బ్రాండ్ల ద్వారా వచ్చి వాటిలో షేర్ ఇచ్చేందుకు రెడీ అవుతుంది. అయితే అటు నెట్ఫ్లిక్స్ సైతం తీవ్ర ప్రయత్నాలు చేస్తుంది. ఇందులో భాగంగా ఇప్పటికే టాప్ లెవల్ లో ఉన్న క్రియేటర్లు నెట్ఫ్లిక్స్‌లో కనిపిస్తున్నారు. మరికొందరు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

కానీ ఆదాయం పరంగా చూస్తే గతంలో ప్రసారమైన ఆల్ఫాబెట్ ప్రకారం India's latent show ద్వారా నెట్ఫ్లిక్స్ కంటే యూట్యూబ్ కి ఎక్కువ ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది. 2025 లో ఈ షో ద్వారా యూట్యూబ్ కు 65 బిలియన్ల ఆదాయం రాగా.. నెట్ ఫ్లిక్స్ కు 45 మిలియన్ డాలర్ల ఆదాయం సమకూరింది. కానీ ఆదాయం కంటే ప్రేక్షకులను, క్రియేటర్ లను దక్కించుకోవడమే అసలైన గెలుపు అని ఈ రెండు సంస్థలు భావిస్తున్నాయి. ఇందులో భాగంగా థియేటర్ల కోసం రెండిటి మధ్య తీవ్రవార్ జరుగుతోంది. ఈ నేపథ్యంలో యూట్యూబ్ క్రియేటర్లు అసలైన కంటెంట్లను తయారుచేసి ఫాలోవర్స్ ను పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని బట్టి చూస్తే భవిష్యత్తులో యూట్యూబ్ మంచి రోజులు ఉన్నాయని అంటున్నారు.

**నడకలో తడబడుతున్నారా?**

శరీర సమతుల్యత తగ్గడం, తరచూ కిందపడటం లేదా చీకట్లో నడవడం కష్టంగా అనిపించడం తీవ్రమైన B12 లోపానికి సంకేతం కావచ్చు.



# బీఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు..

# హరీశ్‌రావు కుట్ర

**మెదక్ ఎమ్మెల్యేలతో రహస్య మంతనాలు**
**కేసీఆర్‌కు వెన్నుపోటు ప్రయత్నం**
**లండన్‌లో హరీశ్‌రావు, రేవంత్‌రెడ్డి లాలూచీ**
**ఆధారాలను ఒక్కొక్కటిగా బయటపెడతాం**
**తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతూ**
**రేవంత్‌రెడ్డి ఆంధ్రా ఏజెంట్‌గా పనిచేస్తున్నారు**
**కల్వకుంట్ల కవిత**



**ముద్ర, హైదరాబాద్:** బీఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు కుట్రలు చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచేందుకు తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. గురువారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు.ఇటీవల మెదక్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో హరీశ్‌రావు రహస్యంగా సమావేశమయ్యారని కవిత ఆరోపించారు. కేసీఆర్ వారసత్వం కేటీఆర్‌కు దక్కకూడదని ఆ సమావేశంలో హరీశ్‌రావు వ్యాఖ్యానించినట్లు తనకు సమాచారం అందిందన్నారు. ఈ విషయాన్ని సమావేశంలో పాల్గొన్న ఓ ఎమ్మెల్యే తనకు తెలిపారని పేర్కొన్నారు. బీజేపీతోనూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనూ హరీశ్‌రావు సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు.లండన్ భేటీపై ఆధారాలు బయటపెడతాంహరీశ్‌రావుకు బీజేపీతో సంబంధాలున్నాయని, రాజ్‌పుష్ప స్కైవాక్ ఓపెన్ విల్లాస్‌లో ఓ బీజేపీ ముఖ్యనేతను తరచూ కలుస్తున్నారని కవిత ఆరోపించారు. ఆయనతో భేటీ ఉన్న రోజుల్లో హరీశ్‌రావు తన కార్యక్రమాలను రద్దు చేసుకుంటున్నారని అన్నారు.అదేవిధంగా హరీశ్‌రావు, రేవంత్‌రెడ్డి ఇటీవల లండన్‌లో రహస్యంగా సమావేశమై ఒప్పందం చేసుకున్నారని కవిత ఆరోపించారు. ఈ భేటీకి సంబంధించిన వివరాలను టీఆర్ఎస్ తరఫున ఒక్కొక్కటిగా బయటపెడతామని చెప్పారు. హరీశ్‌రావుకు ఎలాంటి సంబంధం లేదంటే, ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.హరీశ్‌రావు మంత్రిగా ఉన్న సమయంలో ఆంధ్రాకు చెందిన వ్యాపార సంస్థలతో పాల వ్యాపారం చేశారని కవిత ఆరోపించారు. నారాయణ, చైతన్య విద్యాసంస్థలకు నెలకు రూ.5 కోట్ల చొప్పున పాలు సరఫరా చేశారని, ఎనిమిదేళ్లలో రూ.960 కోట్ల వ్యాపారం జరిగిందని పేర్కొన్నారు. కామినేని, యశోద, కిమ్స్ వంటి కార్పొరేట్ ఆస్పత్రులకు కూడా పాలు సరఫరా చేశారని ఆరోపించారు.రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలుముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టి ఆంధ్రా ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని కవిత మండిపడ్డారు. బ్రాహ్మణ పరిషత్, యాదాద్రి తదితర సంస్థల్లో తెలంగాణకు చెందిన వారికి కాకుండా ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారికి పదవులు ఇస్తున్నారని విమర్శించారు.బ్రాహ్మణ పరిషత్ చైర్మన్‌గా బసవరాజు శ్రీనివాసరాజు నియామకాన్ని ఆమె ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన వ్యక్తికి పదవి ఎలా ఇస్తారని నిలదీశారు. తెలంగాణ బ్రాహ్మణుల్లో అర్హులు లేరా అని ప్రశ్నించారు.జనసేనకు చెందిన ఓ ఎంపీ కుమారుడి రోడ్డు ప్రమాద ఘటనలో నమోదైన ఎఫ్ఐఆర్‌పై కూడా కవిత ప్రశ్నలు లేవనెత్తారు. అదే భోదన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడి విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించిందని, ఆంధ్రా నాయకుల కుమారుల విషయంలో మాత్రం ఎందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని నిలదీశారు.తెలంగాణలో ఆంధ్రా పెత్తనం పెరిగిందిరెడ్‌కో చైర్మన్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీతో పాటు విద్యుత్, నీటిపారుదల శాఖల్లోనూ ఆంధ్రా పెత్తనం కొనసాగుతోందని కవిత ఆరోపించారు. తెలంగాణ జలాల విషయంలోనూ రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం జరుగుతున్నా సీఎం స్పందించడం లేదని విమర్శించారు. కాంట్రాక్టులు కూడా ఆంధ్రా వారికి అప్పగిస్తున్నారని ఆరోపించారు.తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నది మళ్లీ ఆంధ్రా పెత్తనం కోసమా అని ప్రశ్నించిన కవిత.. ముఖ్యమంత్రికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే బ్రాహ్మణ పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల్లో తెలంగాణ వారిని నియమించాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ కూడా ప్రజలను మోసం చేసిందికాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించాల్సిన బీఆర్ఎస్ పూర్తిగా రాజీ పడిందని కవిత విమర్శించారు. పాల వ్యాపారం కోసం హరీశ్‌రావు, రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని ఆరోపించారు.బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఇరిగేషన్, పాల వ్యాపారం, రియల్ ఎస్టేట్, ఇసుక దందాలను వేర్వేరుగా పంచుకుని వ్యవస్థీకృత నేరాలకు పాల్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని అన్నారు.పారదర్శకమైన, అవినీతి రహిత పాలన కోసం, కొత్తవారికి అవకాశం కల్పించేందుకు తాము ముందుకు వచ్చామని కవిత తెలిపారు. తమకు అవకాశం ఇస్తే తెలంగాణ ప్రయోజనాల కోసం పనిచేస్తామని ఆమె అన్నారు.

# నేపాల్ వరద విపత్తు..

**తెలంగాణవాసుల ఆచూకీ**
**మృతదేహాల గుర్తింపుపై ప్రత్యేక సమన్వయం**



**ముద్ర, న్యూఢిల్లీ, ఆగస్టు 30:** నేపాల్‌లో సంభవించిన వరద విపత్తు నేపథ్యంలో తెలంగాణకు చెందిన వారి ఆచూకీ, సురక్షిత తరలింపు, మృతదేహాల గుర్తింపు, స్వదేశానికి తరలింపు అంశాలపై తెలంగాణ భవన్ అధికారులు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ, కాఠ్మాండూలోని భారత రాయబార కార్యాలయం, నేపాల్ పోలీసులతో నిరంతరం సమన్వయం చేస్తున్నారు.విదేశాంగ శాఖ అందించిన సమాచారం ప్రకారం.. ఆగస్టు 29న 449 మంది భారతీయులు టిబెట్ నుంచి నేపాల్‌కు చేరుకోగా, ఆగస్టు 30న మరో 397 మందిని అదే మార్గంలో తరలించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.ఈ జాబితాలో తెలంగాణకు చెందిన శ్రీ అల్లి ఐయిలేష్ పేరు, పాస్‌పోర్టు వివరాలు తెలంగాణ భవన్ రికార్డులతో సరిపోలినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆయన కుటుంబ సభ్యులతో సంప్రదింపుల్లో ఉన్నారని, ఆదివారం రాత్రి సుమారు 10 గంటలకు హైదరాబాద్ చేరుకునే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు వెల్లడించారు.మృతదేహాల గుర్తింపునకు ప్రత్యేక విధానంనేపాల్ ప్రభుత్వం మృతుల ఛాయాచిత్రాలు, ప్రాథమిక వివరాలను నేపాల్ పోలీసుల డిజాస్టర్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచింది. రసువా, నువాకోట్, ధాదింగ్, చిత్వన్, గోర్ఖా, తనహున్, నావల్పరాసీ తూర్పు, నావల్పరాసీ పశ్చిమ, కాఠ్మాండూ జిల్లాల్లో భద్రపరిచిన మృతదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది.కుటుంబ సభ్యులు ప్రత్యక్షంగా గుర్తించగలిగిన సందర్భాల్లో డీఎన్ఏ పరీక్ష తప్పనిసరి కాదని నేపాల్ పోలీసులు తెలిపారు. బంధుత్వాన్ని నిర్ధారించే ఆధారాల ఆధారంగా మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు. ప్రత్యక్ష గుర్తింపు సాధ్యం కానప్పుడు తల్లిదండ్రులు, సోదరులు, సోదరీమణులు వంటి తొలి–స్థాయి బంధువుల డీఎన్ఏ ప్రొఫైల్‌ను సరిపోల్చి గుర్తింపు చేపడతారు.డీఎన్ఏ గుర్తింపు కోసం బంధువులు తప్పనిసరిగా నేపాల్‌కు వెళ్లాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. స్వస్థలంలో సిద్ధం చేసిన డీఎన్ఏ ప్రొఫైల్‌ను సమర్పించే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన ఈ–మెయిల్ విధానాన్ని నేపాల్ పోలీసులు రూపొందిస్తున్నారు.అధికారిక సమాచారం వచ్చే వరకు అప్రమత్తత మృతదేహాల గుర్తింపు, అప్పగింత, స్వదేశానికి తరలింపునకు సంబంధించిన పూర్తి విధివిధానాలను నేపాల్ అధికారులు ఇంకా ఖరారు చేస్తున్నారు. దీంతో డీఎన్ఏ పరీక్షలు చేయించుకునే ముందు లేదా గుర్తింపు కోసం నేపాల్‌కు వెళ్లే ముందు తెలంగాణ భవన్, భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించి అధికారిక సూచనలు తీసుకోవాలని అధికారులు సూచించారు.ప్రతి కేసులో అధికారిక నిర్ధారణ పూర్తయిన తర్వాతే సంబంధిత కుటుంబాలకు, ప్రజలకు తదుపరి సమాచారం అందజేస్తామని తెలంగాణ భవన్ అధికారులు తెలిపారు.

# నాణ్యమైన విద్య, వైద్యం అందరి హక్కు

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**




**ముద్ర, కూకట్‌పల్లి :** రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించడమే లక్ష్యంగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో త్వరలోనే విస్తృత రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ స్పష్టం చేశారు. ఆదివారం ప్రగతి నగర్‌లోని లీలా సుందరయ్య ఫంక్షన్ హాల్‌లో సీపీఎం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "విద్యాహక్కు – ప్రభుత్వాల బాధ్యత" అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి పి. సత్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జాన్ వెస్లీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ప్రభుత్వాలు అవలంబిస్తున్న తీరు వల్ల సమాజంలో పేద, ధనిక వర్గాల మధ్య వ్యత్యాసాలు తీవ్రమవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, వైద్య రంగాలు సంపూర్ణంగా ప్రభుత్వ పరిధిలోనే ఉండాలని, ఈ రెండింటినీ ప్రైవేటీకరించడం వల్ల కార్పొరేట్ శక్తులు వేల కోట్ల రూపాయలు దోచుకునేందుకు ప్రభుత్వాలే మార్గం సుగమం చేస్తున్నాయని విమర్శించారు.ప్రభుత్వాల బడ్జెట్ కోతలు, కుట్రలు ★ బడ్జెట్ కేటాయింపులు: విద్యపై 15 శాతం నిధులు వెచ్చిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం 8 శాతం కూడా ఖర్చు చేయడం లేదని, కొఠారి కమిషన్ సిఫార్సుల ప్రకారం 6 శాతం కేటాయించాల్సిన కేంద్ర ప్రభుత్వం 3 శాతానికే పరిమితమైందని దుయ్యబట్టారు. ★ పాఠశాలల మూసివేత: ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లుగా ప్రతి పంచాయతీలో ఉన్నత పాఠశాల, మండలంలో జూనియర్, నియోజకవర్గంలో డిగ్రీ, జిల్లాలో పీజీ కళాశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దానికి భిన్నంగా రాష్ట్రంలో 8 వేలు, దేశవ్యాప్తంగా లక్ష పాఠశాలల మూసివేతకు కుట్ర జరుగుతోందన్నారు. ★ ఆర్థిక అసమానతలు: దేశంలో కేవలం 300 కుటుంబాల వద్దే రూ. 25 లక్షల కోట్ల సంపద కేంద్రీకృతమై ఉందన్నారు. వారిపై 2 శాతం అదనపు పన్ను విధిస్తే దేశంలో అందరికీ ఉచిత విద్య, వైద్యం అందించవచ్చని సూచించారు.ఎన్ఈపీ తో దేశ విద్యావ్యవస్థకు తీవ్ర నష్టంఈ సదస్సులో పాల్గొన్న ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్ మాట్లాడుతూ, కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం (ఎన్ఈపీ) దేశాన్ని తిరోగమనం వైపు తీసుకెళ్తోందన్నారు. ★ పరోక్ష ప్రైవేటీకరణ: 2035 నాటికి ఉన్నత విద్యలో 'జీఈఆర్'ను 50 శాతానికి పెంచేందుకు ఆన్‌లైన్, డిస్టెన్స్, ఒకేషనల్ విధానాలను ఎంచుకోవడం వల్ల నాణ్యమైన విద్య అందదని, ఇది కేవలం విద్యాసంస్థల సంపాదనకే పనికొస్తుందన్నారు. ★ వృత్తుల కేటాయింపు: ఒకేషనల్ విద్య పేరిట ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థులను మళ్లీ పాత చేతివృత్తులకే పరిమితం చేసే కుట్ర దాగి ఉందన్నారు. ★ ఇంగ్లీష్ విద్య దూరం: మాతృభాష, హిందీ ప్రచారంతో అందరికీ ఇంగ్లీష్ విద్యను దూరం చేసేందుకు కేంద్రం యత్నిస్తోందని, కళాశాలలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వడం ద్వారా వాటిని మార్కెట్ వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అంతకుముందు విద్య ప్రాధాన్యతపై విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజశేఖర్, రవి, శ్రీనివాస్, అశోక్, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు. భవిష్యత్తు ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు.

## ప్రతి కులానికి 'యూనిక్ కోడ్' కేటాయించాల్సిందే

**లేదంటే జనగణనను నిలిపివేయండి**
**ఓబీసీ జాతీయ సదస్సులో వక్తల డిమాండ్**
**శాస్త్రీయత లేకుంటే రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా**
**డిమాండ్లు పట్టించుకోకపోతే దేశవ్యాప్త ఉద్యమం**
**నేతల హెచ్చరిక**




**ముద్ర, న్యూఢిల్లీ, ఆగస్టు 30:**దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణనలో కులగణనను తప్పనిసరి చేయడంతో పాటు ప్రతి కులానికి ప్రత్యేకంగా 'యూనిక్ కోడ్' కేటాయించాలని పలువురు మేధావులు, రాజకీయ నేతలు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్త ఏకాభిప్రాయం కుదిరేవరకు జనగణన ప్రక్రియను నిలిపివేయాలని స్పష్టం చేశారు. ఆదివారం, తెలంగాణ భవన్‌లో 'జనగణనలో కులగణన – ప్రతి కులానికి యూనిక్ కోడ్' అనే ప్రధాన డిమాండ్‌తో ఓబీసీ జాతీయ సదస్సు జరిగింది. బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్, మాజీ ఐఏఎస్ టి. చిరంజీవులు, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి. కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రాజ్యసభ ఎంపీ విల్సన్, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, ఏఐసీసీ ఓబీసీ విభాగం చైర్మన్ అనిల్ జైహింద్, స్వరాజ్ ఇండియా నేత ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ రతన్ లాల్, ప్రొఫెసర్ సూరజ్ మండల్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగొని బాలరాజ్ గౌడ్, ఎస్ దుర్గయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ ఇవ్వకుండా కులగణన నిర్వహించడం శాస్త్రీయ పద్ధతి కాదని వక్తలు విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల తరహాలోనే ఓబీసీలతో పాటు జనరల్ వర్గాలకు కూడా విడివిడిగా ప్రత్యేక కాలమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. డ్రాప్‌డౌన్ మెనూ ద్వారా ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించిన తర్వాతే జనగణన ప్రక్రియను ప్రారంభించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా!శాస్త్రీయమైన ప్రణాళిక లేకుండా మొక్కుబడిగా జనగణన చేపడితే కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తున్న సుమారు రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా అవుతుందని డాక్టర్ సూరజ్ మండల్, ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ఎంపీ విల్సన్ హెచ్చరించారు. ప్రతి కులాన్ని ఖచ్చితంగా నమోదు చేసేలా పారదర్శక, శాస్త్రీయ విధానాన్ని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకుండా మొండిగా ముందుకెళ్తే దేశవ్యాప్తంగా విస్తృత ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.

## మూడో రోజు కొనసాగిన ఇందిరమ్మ ఇల్లు టవర్స్ లాటరీ

**నేటితో ముగియనున్న ప్రక్రియ**

**ముద్ర, హైదరాబాద్, ఆగస్ట్ 30 :** ఇందిరమ్మ ఇల్లు టవర్స్ లాటరీ ప్రక్రియ మూడవరోజు విజయవంతంగా ముగిసింది. ఆదివారం నాడు శేరిలింగంపల్లి, మేడ్చల్, మలక్ పేట, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు చెందిన లాటరీని ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించారు. ఒక్కో నియోజకవర్గంలో 480 ఇండ్లు చొప్పున నాలుగు నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 1920 ఇండ్లకు లబ్దిదారులను ఎంపిక చేశారు. లాటరీ లో ఇల్లు వచ్చిన అబ్దిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ, తమ సొంత ఇంటి కలలు నిజం చేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల సమక్షంలో, హౌసింగ్ బోర్డ్ అధికారులతో పాటు పోలీసు, రెవిన్యూ శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఈ లాటరీ ప్రక్రియ సాగింది. ఆదివారం వరకు 12 నియోజకవర్గాల్లో ఇండ్ల కేటాయింపు లాటరీ ప్రక్రియ పూర్తికాగా, సోమవారం నాడు మరో నాలుగు నియోజకవర్గాలలో లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నారు. సనత్ నగర్, మహేశ్వరం, మల్కాజిగిరి,,కార్వాన్ నియోజకవర్గాల్లో సోమవారం నాడు లాటరీ ప్రక్రియ జరుగుతుందని హౌసింగ్ బోర్డ్ అధికారులు తెలిపారు. ఆ నాలుగు నియోజకవర్గాల్లో సెప్టెంబర్ మూడు వరకు దరఖాస్తుల స్వీకరణ. ఇందిరమ్మ ఇల్లు టవర్స్ పథకంలో భాగంగా హైదరాబాద్ ఓఆర్ఆర్ పరిధిలో లక్ష ఇండ్లను నిర్మించాలన్న లక్ష్యంతో, పైలట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఇండ్లను నిర్మించాలని సంకల్పించింది. ఇందులో భాగంగా ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో దరఖాస్తులు స్వీకరించి ఇండ్ల కేటాయింపు ప్రక్రియను చేపట్టింది. ఈ పదహారు నియోజకవర్గాలు కాకుండా గోషామహల్, ఎల్బీనగర్, ముషీరాబాద్, చంద్రాయణ గుట్ట నియోజకవర్గాల ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఈ నాలుగు నియోజకవర్గాల్ల ని ప్రజలు సెప్టెంబర్ మూడో తేదీ వరకు మీసేవ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించవచ్చని హౌసింగ్ బోర్డ్ పేర్కొంది. సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న అర్హులైన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

## జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు విజయవంతం

**ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 30:** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (SATG) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 28, 29, 30 తేదీలలో నిర్వహించిన క్రీడా, ఫిట్‌నెస్ కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. భారత ప్రభుత్వం ప్రకటించిన "ఖేలేగా భారత్ – జీతేగా భారత్" నినాదానికి అనుగుణంగా ఈ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.రాష్ట్రంలోని 32 జిల్లాల కేంద్రాలతో పాటు హైదరాబాద్ నగరంలోని వివిధ క్రీడా మైదానాలు, స్టేడియంలలో నిర్వహించిన కార్యక్రమాల్లో యువ క్రీడాకారులు, విద్యార్థులు, క్రీడాభిమానులు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కార్యక్రమాల నిర్వహణలో చురుకైన పాత్ర పోషించాయి.ఆగస్టు 28న భారత హాకీ దిగ్గజం, దేశ క్రీడా గర్వకారణమైన మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ఆయన సేవలను స్మరించడంతో పాటు క్రీడల ప్రాధాన్యం, క్రీడాస్ఫూర్తి, ఆరోగ్యకర జీవన విధానాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా "ఏక్ ఘంటా ఖేల్ కే మైదాన్ మేన్" కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. ఖో–ఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్ తదితర క్రీడా పోటీలతో పాటు "29 ఛాలెంజ్", "పాస్ ది బాల్ ఛాలెంజ్", "మీట్ ది ఛాంపియన్స్" వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. మహిళలు, యువత, వృద్ధులు, దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.వేడుకల ముగింపు సందర్భంగా ఆగస్టు 30న "స్పెషల్ సండేస్ ఆన్ సైకిల్", రన్‌లు, వాక్‌థాన్‌లు నిర్వహించి ప్రజల్లో ఫిట్‌నెస్, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. శారీరక దృఢత్వం, ఆరోగ్య సంరక్షణ, క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు మాట్లాడుతూ, యువతలో క్రీడా చైతన్యాన్ని పెంపొందించడం, ఆరోగ్యకర జీవన విధానాలను ప్రోత్సహించడం, ఫిట్ ఇండియా ఉద్యమాన్ని గ్రామీణ స్థాయికి విస్తరించడం లక్ష్యంగా మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడిన క్రీడా ఉత్సాహం తెలంగాణలో క్రీడా సంస్కృతి మరింత బలోపేతం కావడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 31.08.2026
www.mudranews.in | @mudranews



## శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉందా?

B12 లోపంతో రక్తహీనత ఏర్పడితే బలహీనతతో పాటు శ్వాస తీసుకో వడంలో ఇబ్బంది, వ్యాయామ సామర్థ్యం తగడం వంటి లక్షణాలు కని పించవచ్చు.



## మన్ కి బాత్ ప్రసంగం వీక్షించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**ముద్ర, కరీంనగర్** : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 137వ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్ ప్రసంగాన్ని కరీంనగర్ లోకేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ నివాసంలో విక్షించారు. ఆదివారం ఉదయం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ గృహంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, యాదగిరి సునీల్ రావు మరియు బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం, మాజీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు, పాల్గొన్నారు.

## చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా విల్లా ప్రాజెక్టులు ప్రారంభం




**ముద్ర, హైదరాబాద్:** ప్రీమియం రెసిడెన్షియల్ విభాగంలో తమ పోర్ట్ ఫోలియోను విస్తరిస్తూ ఆర్క్ గ్రూప్ కొంగర కలాన్ లో 'ఆర్క్ అర్థ', 'ఆర్క్ ఆర్యమా' పేరుతో రెండు విలాసవంతమైన విల్లా సము దాయాలను ప్రారంభించింది. శ్రీ శ్రీ శ్రీ శ్రీమన్నారాయణ రామా నుజ జీయర్ స్వామిజీ ముఖ్య అతిథిగా హాజరైన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఈ ప్రాజెక్టులను ఆవిష్కరించారు. గోప్యత, ప్రకృతి, విశాలమైన నివాస ప్రదేశాలు, ఆధునిక సౌకర్యాలను సమన్వయం చేస్తూ ఈ రెండు ప్రాజెక్టులను రూపొందించినట్లు ఆర్క్ గ్రూప్ తెలిపింది. ఆర్క్ అర్థలో 22,000 చదరపు అడుగుల క్లబ్ హౌస్ , ఆర్క్ ఆర్యమాలో 30,000 చదరపు అడుగుల క్లబ్ హౌస్ తో పాటు పలు ప్రీమియం సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. కొంగర కలాన్ అభివృద్ధి చెందుతున్న మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి భవిష్యత్ ప్రాజెక్టులకు సమీపంలో ఉండటం ఈ విల్లా కమ్యూనిటీలకు కీలక ప్రయోజనమని సంస్థ తెలిపింది. ఆర్క్ గ్రూప్ సీఎండీ జి. రామ్ రెడ్డి, సీఈఓ మేఘనా గుమ్మి మాట్లాడుతూ, కేవలం ఇళ్లను కాకుండా కుటుంబాలకు ప్రత్యేకమైన, దీర్ఘకాలిక జీవన అనుభవాన్ని అందించే కమ్యూనిటీలను సృష్టించడమే తమ లక్ష్యమని తెలిపారు.

## వివాహాలకు చంద్రబాబు హాజరు



**ముద్ర, అమరావతి** : గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె, అనంతపురం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు కుమారుడి వివాహానికి ముఖ్య మంత్రి చంద్రబాబు హాజరయ్యారు. అనంతపురం పట్టణంలోని ఎమ్వైఆర్ కన్వెన్షన్‌లో జరిగిన ఈ వివాహానికి హాజరై నూతన దంపతులు శివరాజు–విద్యను సీఎం చంద్రబాబు ఆశీర్వదించారు.

## ఉజ్బెకిస్థాన్‌లో భారతీయులకు 30 రోజులు వీసా ఫ్రీ



**ముద్ర, తాష్కెంట్**: భారత పౌరుల కోసం ఉజ్బెకిస్థాన్ 30 రోజుల వీసా రహిత (వీసా–ఫ్రీ) విధానాన్ని ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ ఉజ్బెకిస్థాన్ పర్యటన సందర్భంగా ఆ దేశాధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. దీని ద్వారా భారతీయ పౌరులు ఎలాంటి వీసా లేకుండానే 30 రోజుల పాటు ఆ దేశంలో పర్యటించొచ్చు. ఇరు దేశాల మధ్య పర్యాటకం, వ్యాపార సంబంధాలు, ప్రజల మధ్య అనుసంధానాన్ని పెంచడానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని మిర్జియోయెవ్ పేర్కొన్నారు. ''భారత్ మాకు నమ్మదగిన వ్యూహాత్మక భాగస్వామి. మా మధ్య వాణిజ్యం గతేడాది 1 బిలియన్ డాలర్లు దాటింది. జాయింట్ వెంచర్ల సంఖ్య పెరిగింది. ఇరు దేశాల మధ్య ప్రతివారం 14 డైరెక్ట్ విమానాలు నడుస్తున్నాయి'' అని మిర్జియోయెవ్ పేర్కొన్నారు.

**మోదీకి పురస్కారం**

అంతకుముందు ఇరు దేశాధినేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరు దేశాల సంబంధాల బలోపేతం, వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, యూపీఐ, రక్షణ, వంటి అంశాలు వీరి మధ్య చర్చకు వచ్చాయి. 2030 నాటికి 5 బిలియన్ డాలర్ల వాణిజ్యం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య స్నేహాన్ని బలోపేతం చేయడానికి చేసిన కృషికి గాను 'ఒలియ్ దరాజాలి దోస్ట్లిక్' పురస్కారాన్ని ప్రధాని మోదీకి మీర్జియోయెవ్ ప్రదానం చేశారు. విదేశీ నాయకులకు ఉజ్బెకిస్థాన్ ఇచ్చే అత్యున్నత పురస్కారాల్లో ఇదీ ఒకటి. అలాగే, తాష్కెంట్‌లోని భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి ప్రధాని మోదీ నివాళులర్పించారు. 1966 జనవరి 11న 1965 భారత్–పాకిస్థాన్ యుద్ధం తర్వాత జరిగిన శాంతి ఒప్పందంపై (తాష్కెంట్ డిక్లరేషన్) సంతకం చేసిన రోజు రాత్రి తాష్కెంట్‌లో లాల్‌బహదూర్ శాస్త్రి ఆకస్మికంగా మరణించారు.

## కాప్రా చెరువులో నిమజ్జనాలు వద్దు

**ముద్ర, హైదరాబాద్:** జీవ వైవిధ్యానికి ప్రతీకగా, నగర పర్యావరణ సమతుల్యతకు కీలకమైన వెట్‌ల్యాండ్‌గా గుర్తింపు పొందిన కాప్రా చెరువులో గణేష్ నిమజ్జనాలకు వెసులుబాటు లేదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. శనివారం ఆయన కాప్రా చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం భాగ్యనగర్ ఉత్సవ సమితి స్థానిక ప్రతినిధులతో మాట్లాడి పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా గణనాథుల నిమజ్జనాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కాప్రా చెరువు అర్బన్ వెట్‌ల్యాండ్ జాబితాలో ఉందని, ఇక్కడి జీవవైవిధ్యం, పక్షుల ఆవాసాలు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు.

# జిల్లాలో నీట్ పీజీ పరీక్ష ప్రశాంతం

**పరీక్ష రాసిన 1471 మంది**
**34 మంది గైర్హాజరు**
**పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం**



**ముద్ర, కరీంనగర్** : జిల్లాలో నిర్వహించిన నీట్ (NEET-PG)–2026 పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణను ఆదివారం కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సంయుక్తంగా పర్యవేక్షించారు. జిల్లాలోని తిమ్మాపూర్ మండలం వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ పోలీస్ కమిషనర్ ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల ప్రవేశం, భద్రతా తనిఖీలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, బయోమెట్రిక్ ధృవీకరణ, తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు.పరీక్ష సజావుగా జరిగేలా పోలీసు శాఖ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయగా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేశాయి.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ నీట్ పిజి పరీక్ష నిర్వహణలో భాగస్వాములైన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్ల నీట్ పరీక్ష విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. పరీక్ష సజావుగా సాగేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని చెప్పారు.

పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ పరీక్ష పారదర్శక నిర్వహణకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టామని, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పరీక్షలు రాసేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

జిల్లాలోని మొత్తం 7 పరీక్షా కేంద్రాల్లో 1505 మంది అభ్యర్థులకు గాను 1471 మంది హాజరుకాగా, 34 మంది గైర్హాజరయ్యారు.

పరీక్ష నిర్వహణలో జిల్లా విద్యాశాఖ అధికారులు, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సెంచరీతో చెలరేగిన డీజీపీ సీవీ ఆనంద్..



**ముద్ర, హైదరాబాద్**: తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ సెంచరీ కొట్టారు. స్వతహాగా క్రికెటరైన ఆయన 'సి–డివిజన్ వన్డే లీగ్ ఛాంపియన్‌షిప్'లో అదరగొట్టారు. సికింద్రాబాద్ క్లబ్ మైదానంలో హైదరాబాద్ జిల్లాతో జరిగిన మ్యాచ్‌లో శతకం (126 నాటౌట్) బాదారు. దీంతో సికింద్రాబాద్ క్లబ్ జట్టు 95 పరుగుల తేడాతో విజయం సాధించింది.

సికింద్రాబాద్ క్లబ్ తరఫున ఓపెనర్‌గా బరిలోకి దిగిన సీవీ ఆనంద్.. ఫోర్లు, సిక్సలతో విరుచుకుపడ్డారు. 82 బంతుల్లో 21 ఫోర్లు, 5 సిక్సర్లు బాదారు. బౌలింగ్ లోనూ ఆయన రాణించారు. 5 ఓవర్లు వేసి.. ఎనిమిది పరుగులు మాత్రమే ఇచ్చి విజయంలో కీలక పాత్ర పోషించారు. ఐపీఎస్ కాకముందు క్రికెట్ ప్లేయర్ అయిన డీజీపీ సీవీ ఆనంద్.. చదువుకునే రోజుల్లోనే అండర్–22కు ఎంపికయ్యారు. సికింద్రాబాద్ క్లబ్ తరఫున ఆడుతూ ఐదు సెంచరీలు సాధించారు. 2019లో అఖిల భారత టెన్నిస్ టోర్నీలోనూ ప్రథమ స్థానం సాధించారు. గోల్ఫ్ టోర్నమెంట్ల లోనూ పాల్గొన్నారు.

## కరీంనగర్ అభివృద్ధికి నిరంతరం కృషి

**మాజీ మంత్రి గంగుల కమలాకర్**
**రూ.50 లక్షల UIDF నిధులతో 58వ డివిజన్‌లో ఎస్‌డబ్ల్యూజీ ఆర్‌సీసీ పైప్‌లైన్, సీసీ రోడ్డు పనుల పరిశీలన**
**హాజరైన మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్**



**ముద్ర, కరీంనగర్** : కరీంనగర్ నగరంలో అభివృద్ధి పనుల జోరు కొనసాగుతోంది. నగరంలోని 58వ డివిజన్ టవర్ సర్కిల్ వినాయక మందిరం ప్రాంతంతో పాటు పలు కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పరిశీలించారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (UIDF) నిధులు రూ.50 లక్షలతో చేపట్టిన ఎస్‌డబ్ల్యూజీ ఆర్‌సీసీ (SWG RCC) పైప్‌లైన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు, కాంట్రాక్టర్‌కు దిశానిర్దేశం చేశారు.

**ప్రత్యేక పూజలతో పనుల పరిశీలన ప్రారంభం**

పనుల పరిశీలనకు ముందు నాయకులు డివిజన్‌లోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయాన్ని సందర్శించారు. గణపతి భగవానుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి వేద మంత్రోచ్ఛరణలతో స్వాగతం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

**నాణ్యతలో రాజీ పడొద్దు: అధికారులకు ఆదేశం**

అనంతరం పనులు జరుగుతున్న ప్రాంతాన్ని కలియతిరిగి పరిశీలించిన గంగుల కమలాకర్, వినోద్‌కుమార్.. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి కాలనీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో నగర బీఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మెన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ నాయకులు సోహన్ సింగ్, పలువురు డివిజన్ నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై చర్చించాలే గానీ వ్యక్తిగత దూషణలకు దిగడం ఏంటి?

**నగర అభివృద్ధిపై బీజేపీ పాలకవర్గానికి చిత్తశుద్ధి లేదు**
**మున్సిపల్ ఎన్నికల్లో అనేక హామీలిచ్చి ఓట్లు వేయించుకున్న బీజేపీ**
**కేంద్రం నుండి నిధులు తేవడంలో విఫలమైంది**
**క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకునే ఓపిక పరిష్కరించే ప్రయత్నం బీజేపీ పాలకవర్గం చేయడం లేదు**
**సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**




**ముద్ర, కరీంనగర్** : క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పాలకవర్గం సమావేశంలో చర్చించి పరిష్కారం మార్గానికి ప్రయత్నం చేయాలేగానీ మాజీ మేయర్లు గా పని చేసిన వాళ్లే వ్యక్తిగత దూషణలకు దిగడం మంచిది కాదని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.మార్కెట్ రోడ్డు వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కూరుకుపోయిన డ్రైనేజీని పరిశీలించిన అనంతరం పక్కన గల అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ మున్సిపల్ ఎన్నికల్లో కేంద్రం నుండి నిధుల వరద తీసుకువచ్చి నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామని ఓట్లు దండుకొని ఇప్పుడు క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గాలికి వదిలేసి వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని నగర అభివృద్ధిపై వీరికి చిత్తశుద్ధి లేదని నరేందర్ రెడ్డి మండిపడ్డారు.రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వ వాటాను కేంద్రం నుండి తీసుకువచ్చినట్టు ప్రజలకు భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు అన్నీ గమనిస్తున్నారని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఆధిపత్య పోరుపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో లేదని ఇప్పటికైనా కేంద్రం నుండి నగర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ మరియు నిరుద్యోగ యువతకు ఏదైనా ప్రాజెక్ట్ తీసుకురావడానికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ కృషి చేయాలని నరేందర్ రెడ్డి కోరారు.

## వాతావరణ శాఖ హెచ్చరిక.. పలు జిల్లాల్లో వర్షం

**ముద్ర, హైదరాబాద్**: వాతావరణ శాఖ రాష్ట్రానికి వర్ష సూచనలు జారీ చేసింది. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, ఆదిలాబాద్, యాదాద్రి, ఉమ్మడి మెదక్ జిల్లాలకు వర్ష హెచ్చరికలు జారీ చేసింది. ఈ ప్రాంతాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. అదే విధంగా పలు చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

# రైతాంగానికి రెండు జేసీబీలు.. కారుమంచి ప్రసాద్ వితరణ



కారుమంచి ప్రసాద్ కు కృతజ్ఞతలు

**ముద్ర, అమరావతి** : గుంటూరు జిల్లా కాకుమానుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్ రైతాంగానికి ఉపయోగపడేలా రూ. కోటి విలువగల రెండు జేసీబీలను వితరణగా అందజేశారు. మొదటిగా కాకుమాను మండలంలోని అన్ని గ్రామాల రైతుల ప్రయోజనం కోసం ఈ జేసీబీలు ఉచిత సేవలు అందజేస్తాయి. ఆయా గ్రామాల పరిధిలోగల కాలువల బాగుసేతకు, పొలాలకు వెళ్లే రహదారుల నిర్మాణాలకు, ఇతరత్రా పనులకు వీటిని వినియోగిస్తారు. తమ గ్రామాల్లో చేపట్టాల్సిన పనుల వివరాలు తెలియజేస్తే వీటిని అక్కడకు తరలిస్తారు. అందుకు ఒక లారీని కూడా కొనుగోలు చేసి అందుబాటులో ఉంచారు.

వీటిని ఆయా పనులకు వినియోగించుకోదలచిన గ్రామస్తులు ఆయిల్ పోయించుకుని ఎంత సమయమైనా వాడుకోవచ్చు. వీటి నిర్వహణ బాధ్యతలను కాలువ ప్రసాద్ కు అప్పగించారు. కొత్తగా వచ్చిన రెండు జేసీబీలకు ఆదివారం కొండపాటూరు పోలేరమ్మ దేవస్థానంలో పూజలు చేయించారు.

రైతుల ప్రయోజనార్థం ఉచితంగా రెండు జేసీబీలను అందజేసిన కారుమంచి ప్రసాద్ కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, రైతు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కాకుమాను ప్రాంత రైతులకు ఉపయోగపడే వివిధ పనులకు ఆయన ఈపాటికే నిధులు సమకూర్చి రైతుబాంధవుడుగా పేరు పొందారని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలేరమ్మ దేవస్థానం ట్రస్టు బోర్డ్ చైర్మన్ పొన్నం వీరయ్య చౌదరి, కాకుమాను మండల టీడీపీ అధ్యక్షుడు మామిళ్లపల్లి రాంగోపాల్, కాంద్రు గోపి, యర్రాకుల దానయ్య, ముత్తినేని భాస్కరరావు, టీడీ ప్రసాద్, పొన్నం శ్రీనివాసరావు, గింజుపల్లి నవీన్, తోట ఫణీంద్రకుమార్, వట్టికూటి వెంకటేశ్వర్లు, కెబీ పాలెం సర్పంచి పెద్ది రవి, మువ్వా రామచంద్రరావు,ఈదర శరత్, జంగా మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 31.08.2026
www.mudranews.in | @mudranews



**ఏకాగ్రత తగ్గుతోందా?**

విషయాలు గుర్తుపెట్టుకోవడంలో ఇబ్బంది, ఆలోచించడానికి ఎక్కువ సమయం పట్టడం, గందరగోళంగా అనిపించడం B12 లోపం సంకేతాలు కావచ్చు.



# మధిరలో రూ.131.61 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 30 :** మధిర నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నియోజకవర్గ పరిధిలోని చింతకాని, బోనకల్ మండలాల్లో ప్రజల మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ, ఏకంగా రూ.131.61 కోట్ల అంచనా వ్యయం తో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు విద్య, వ్యవసాయ రంగాలకు ఊతమిచ్చేలా ప్రభుత్వం ఈ నిధులను కేటాయించిందని డిప్యూటీ సీఎం వెల్లడించారు.చింతకాని మండల వ్యాప్తంగా విద్యా రంగానికి, అంతర్గత రోడ్ల పునర్నిర్మాణానికి పెద్దపీట వేశారు. లచగూడెంలో రూ.29 కోట్లతో నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే క్రమంలో లచగూడెం–అనంతారం బీటీ రోడ్డుకు రూ.7 కోట్లు, నాగిలిగొండ–తూటికుంట్ల బీటీ రోడ్డుకు రూ.5.25 కోట్లు, లచగూడెం–నేరడ రహదారికి రూ.1.75 కోట్లు కేటాయించారు. అలాగే కోడుమూరు ఎస్సీ కాలనీలో అంతర్గత సీసీ రోడ్లకు రూ.66 లక్షలు, చింతకాని ఎస్సీ కాలనీకి రూ.44 లక్షలు, నాగిలిగొండ ఎస్సీ కాలనీ అభివృద్ధికి రూ.85 లక్షలు మంజూరు చేశారు.బోనకల్ మండలంలోనూ భారీ స్థాయిలో నిధులు కేటాయించి రహదారులు, వ్యవసాయ మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే పనులను చేపట్టారు. ప్రధానంగా కలకోట–రాపల్లి–గన్నవరం–ముసలిమడుగు–లక్ష్మీపురం రహదారి వెడల్పు, పటిష్టీకరణ పనులకు రూ.57 కోట్లు, బ్రహ్మణపల్లి–గన్నవరం మీదుగా రాపల్లి పిడబ్ల్యూడీ రహదారి విస్తరణకు రూ.26 కోట్లు మంజూరు చేశారు. రైతుల ప్రయోజనాల కోసం నారాయణపురంలో రూ.80.84 లక్షలతో 1000 మెట్రిక్ టన్నుల, మోటమర్రిలో రూ.24.50 లక్షలతో 300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల పీఏసీఎస్ గోదాముల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండలంలోని నారాయణపురం ఎస్సీ కాలనీలో డ్రైనేజీలు, సీసీ రోడ్లకు రూ.63 లక్షలు, మోటమర్రి ఎస్సీ కాలనీకి రూ.1 కోటి, రాయన్నపేట ఎస్సీ కాలనీకి రూ.19 లక్షలు మరియు రాపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనానికి రూ.20 లక్షలు కేటాయించారు.ప్రజల ప్రాథమిక అవసరాలను గుర్తించి, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ పనులన్నీ పూర్తయితే గ్రామీణ ప్రాంతాల్లో రవాణా కష్టాలు తీరడమే కాకుండా విద్య, వ్యవసాయ రంగాలు మరింత పురోగతి సాధిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గ ప్రసాద్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు నాయుడు సత్యనారాయణ, రాయల నాగేశ్వర రావు, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పొలం గట్టున పొంగిపొర్లిన ఆత్మీయత

### శ్రమజీవుల చెంతకు డిప్యూటీ సీఎం భట్టి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 30 :** హంగూ ఆర్భాటాలకు దూరంగా, కష్టజీవుల చెంత నిలిచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన ఆత్మీయతను చాటుకున్నారు. బోనకల్ మండలంలో ఆయన సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా పొలంలో కూలీ పనులు ముగించుకుని, మధ్యాహ్న భోజనానికి సిద్ధమవుతున్న మహిళా శ్రమజీవుల వద్దకు నేరుగా వెళ్లారు. హోదాను పక్కనపెట్టి వారితో ముచ్చటించారు. "ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా?" అని భట్టి విక్రమార్క ఆప్యాయంగా పలకరించగా.. సన్నబియ్యం పంపిణీ, గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం తమ కుటుంబాలకు కొండంత ఆసరాగా నిలుస్తున్నాయని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రయాణ ఛార్జీలు మిగలడం, కరెంట్ బిల్లుల భారం తగ్గడంపై కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రజల అవసరాలు తీర్చి, వారి జీవితాల్లో వెలుగులు నింపడమే ఈ ప్రజా ప్రభుత్వ ప్రధాన బాధ్యతని స్పష్టం చేశారు. పథకాల లబ్ధిదారులకు క్రమం తప్పకుండా నిధులు చెల్లిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించం




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం ఆగస్టు 30 :** జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జర్నలిస్టులను సమీకరించి పోరుబాట పడతామని టీయూడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణు గోపాల్ హెచ్చరించారు. జర్నలి స్టులు ఎప్పుడు అడిగిన ప్రభుత్వం కాదనడం లేదని కానీ పని కూడా పూర్తి చేయడం లేదని ఖమ్మంలో ప్రభుత్వం కేటాయించిన స్థలం ఉండి అర్హులైన జర్నలిస్టుల జాబితా అధికారుల వద్ద ఉన్నా కూడా నిర్ణ యం తీసుకోవడంలో ఎందుకు జా ప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. నగర కమిటీ సమావేశం స్థానిక మాంగళ్య ఫంక్షన్ హాల్లో జరిగింది. నగర అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేణుగోపాల్ మాట్లాడుతూ హెల్త్ కార్డుల విషయంలో ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా హెల్త్ కార్డుల ద్వారా జర్నలిస్టులకు వైద్యం అందే ఏర్పాటు చేస్తామన్న హామీని ప్రస్తుత ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 400 మంది జర్నలిస్టులు అనారోగ్య కారణాలతో చనిపోయారని ఇప్పటికైనా అనారోగ్యం బారిన పడిన జర్నలిస్టులను ఆదుకునేందుకు హెల్త్ కార్డులను తక్షణం జర్నలిస్టులకు అందించాలన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ముఖ్యంగా తమిళనాడు, కేరళ తది తర రాష్ట్రాల్లో జర్నలిస్టులకు పించన్ స్కీంను అమలు చేస్తున్నారని రాష్ట్రం లో కూడా అమలు చేయాలని డిమాండ్ చేస్తుందన్నారు. ఖమ్మం ఇండ్ల స్థలాల సమస్య రెండు దశాబ్దాలుగా పెండింగ్లో ఉందని ఐజెయు పోరాట ఫలితంగా 23 ఎకరాల స్థలాన్ని సొసైటీకి ఇస్తూ గత క్యాబినెట్ తీర్మానం చేసిందని దానిని జర్నలిస్టులకు అందించేందుకు సత్వరం చర్యలు చేపట్టాలన్నారు. మంత్రుల హామీ మేరకు కొంత సమయం ఇచ్చామని మరింత తాత్సరం చేస్తే పోరుబాట పడతామన్నారు. సెప్టెంబర్లో అన్ని నియోజక వర్గాల సమావేశాలను పూర్తి చేసుకుని అక్టోబర్లో ప్రభుత్వ తీరును బట్టి పోరాట కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకట్రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట్రావు, సామినేని మురారి, హౌజింగ్ సొసైటీ అధ్యక్షు లు కనకం సైదులు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి మహేం దర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం, వీడియో జర్న లిస్టు అసోసియే షన్ జిల్లా అధ్యక్షులు అప్పారావు, నగర కోశాధికారి వేణుగోపాల్, నాయకులు మాధవ రావు, బ్యూరోలు మోహినుద్దీన్, సత్యనారాయణ, నగర కమిటీ సభ్యులు, చానెల్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా కళ్యాణం



స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం శ్రావణ మాస శోభను సంతరించుకుంది. నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలు, మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారు సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. వేదమంత్రోచ్ఛారణలతో స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. భక్తులు నయనానందకరంగా శ్రీవారిని దర్శించుకున్నారు. రాత్రి పద్మావతి అమ్మవారికి విశేషంగా సహస్ర కుంకుమార్చన సేవ నిర్వహించారు. – ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

### టీయూడబ్ల్యూజేయు జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి




**ముద్ర, దేవరకొండ:** వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి టియుడబ్ల్యూజేయు (ఐజేయు) నిరంతరం కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి అన్నారు. కనగల్ మండల కేంద్రంలో ఆదివారం టియుడబ్ల్యూజేయు మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులను ఇల్లు ఇళ్ళ స్థలాలను మంజూరు చేయించేందుకు టీయూడబ్ల్యూజేయు పోరాడుతుందన్నారు. అనంతరం కనగల్ మండల ప్రెస్ క్లబ్ (టీయూడబ్ల్యూజేయు) కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సుంకిరెడ్డి జాగాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మల్లెపల్లి నరసింహ, ఉపాధ్యక్షులుగా దాసిరెడ్డి నవీన్ రెడ్డి, మహేశ్వరం రమేష్ కుమార్, కోశాధికారిగా రాయల సునీల్ కుమార్, కార్యదర్శిగా పాలకూరి లింగస్వామి సహాయ కార్యదర్శిగా తొరకొప్పుల నాగయ్య కమిటీ సభ్యులుగా చీదేటి వంశీధర్ రెడ్డి, మాచర్ల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను జిల్లా అధ్యక్షుడు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి దోటి శ్రీనివాస్, అక్షర కలం ఎడిటర్ పిట్టల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరాలు అభినందనీయం

### పేద ప్రజలకు మా కుటుంబం అండగా ఉంటుంది

### రాష్ట్ర ఏవన్ కాంట్రాక్టర్ సంకినేని కృష్ణారావు




**ముద్ర, తుంగతుర్తి:** పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని రాష్ట్ర ఏవన్ కాంట్రాక్టర్ సంకినేని కృష్ణారావు అన్నారు. అక్షర ఫౌండేషన్ సూర్యాపేట ఆధ్వర్యంలో, శంకర కంటి ఆస్పత్రి–హైదరాబాద్ సారథ్యంలో, స్వర్గీయ సంకినేని కమలమ్మ–రామారావు జ్ఞాపకార్థం ఎస్కేఆర్ కన్స్ట్రక్షన్స్–సూర్యాపేట సౌజన్యంతో ఆదివారం తుంగతుర్తి హైస్కూల్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన సంకినేని కృష్ణారావు తన తల్లిదండ్రుల చిత్రపటాల ముందు జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి చూపు ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో విలువైనదని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం పొందలేని వారికి ఇలాంటి శిబిరాలు ఎంతో ప్రయోజనకరమని అన్నారు.గత నాలుగైదు దశాబ్దాలుగా తమ కుటుంబం పేద ప్రజలకు అండగా నిలుస్తోందని, ప్రజల అభ్యున్నతే తమ ధ్యేయమని తెలిపారు. తుంగతుర్తి ప్రాంత ప్రజలు తమ కుటుంబంపై చూపుతున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన ఇకముందు కూడా నియోజకవర్గంలోని పేద కుటుంబాలకు అండగా ఉంటూ, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.శిబిరానికి తుంగతుర్తితో పాటు పరిసర గ్రామాల నుంచి 256 మంది కంటి పరీక్షల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. పరీక్షల అనంతరం 48 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరిని హైదరాబాద్కు తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు.భవిష్యత్తులోనూ అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు మరిన్ని ఉచిత వైద్య సేవలు అందిస్తామని వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో తుంగతుర్తి గ్రామ సర్పంచ్ మల్లెపాక సాయిబాబు, అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్ రెడ్డి, అధ్యక్షుడు ఉప్పు నాగయ్య, శంకర కంటి ఆస్పత్రి యూనిట్ హెడ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఎలగందుల శ్రీనివాస్, రిటైర్డ్ ఎంప్లాయీ సంతోష్, ఆర్గనైజర్ శివ, గడ్డం వీరబాబు, యాస అక్షయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వేంకటేశ్వర కాలనీ సంక్షేమ సంస్థ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక




**ముద్ర, మోత్కూరు:** మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సంస్థ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష ప్రధానకార్యదర్శులుగా గట్టు వెంకటేశ్వరరావు, దర్శనం వెంకన్న, గౌరవ అధ్యక్షులుగా గణగానీ నర్సయ్య, ఉపాధ్యక్షులుగా దేవరపల్లి విద్యాసాగర్ రెడ్డి, కోశాధికారిగా కడారి నర్సయ్య, సహాయ కార్యదర్శిగా యాస అమరేందర్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నందుకు కాలనీవాసులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీకృష్ణుని జీవితం మానవాళికి జ్ఞానదీపం

### ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల కరపత్రాల ఆవిష్కరణ



**ముద్ర, హన్మకొండ:** త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక ప్రబోధాల వెలుగులో, ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక (జమ్మికుంట శాఖ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించ తలపెట్టిన తొమ్మిది రోజుల శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాల కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. హన్మకొండ – హంటర్ రోడ్డులోని 'ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్ భవన్' వేదికగా జరిగిన ఈ భక్తిపూర్వక కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు ముఖ్య అతిథిగా విచ్చేసి కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా సాంబారి సమ్మారావు మాట్లాడుతూ... శ్రీకృష్ణ భగవానుని అవతార విశిష్టతను, ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని కొనియాడారు. శ్రీకృష్ణుడు క్రీస్తు పూర్వం 3228 సంవత్సరంలో ధరణిపై అవతరించి, తన సమగ్ర జీవన గమనంతో జగత్తుకు మహోన్నత జ్ఞాన సందేశాన్ని అందించారని పేర్కొన్నారు. అజ్ఞానపు అంధకారం నుంచి విముక్తి ప్రసాదించి, జ్ఞాన మార్గం వైపు నడిపించే పరమ చేతనకు శ్రీకృష్ణుడే కేంద్ర బిందువని స్పష్టం చేశారు. ఆయన లోకానికి అనుగ్రహించిన దివ్య భగవద్గీత నిత్య సత్యమని, గీతా ప్రబోధం ద్వారా సమాజానికి పరమ సత్యాన్ని చాటిచెప్పారని వివరించారు.కార్యక్రమ నిర్వాహకులు, ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బాధ్యులు శ్రీ పెరుంబుదురి వెంకటాచార్యులు మాట్లాడుతూ... కాజీపేటలోని రైల్వే క్వార్టర్లలో తొమ్మిది రోజుల పాటు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అత్యంత భక్తిప్రపత్తులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 12 తేదీన శ్రీకృష్ణ పరమాత్ముని దివ్య ప్రతిమను శోభాయమానమైన పల్లకీలో కొలువుదీర్చి అంగరంగ వైభవంగా ఊరేగింపు మహోత్సవం నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ తొమ్మిది రోజులు ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు భగవద్గీత జ్ఞాన విశ్లేషణలు, ఆధ్యాత్మిక చర్చలు నిర్విరామంగా కొనసాగుతాయని పేర్కొన్నారు.ఈ దివ్య మహోత్సవ వేదికపై పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, తెలంగాణ ఆన్లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి మరియు ఢీంబాయ్ టీవీ సీఈవో వేముల సదానందం నేత, సీనియర్ జర్నలిస్టులు చిప్ప సుధాకర్, గడుదాసు నమస్తేలతో పాటు కుమార్, రాజలింగం, భక్తులు పాల్గొన్నారు.

## టీపీసీసీ ఆదేశాలు వచ్చే వరకు కమిటీలు వేయొద్దు

### డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య

**ముద్ర, తుంగతుర్తి:** టీపీసీసీ నుంచి తుది ఆదేశాలు వచ్చే వరకు తుంగతుర్తి నియోజకవర్గంలో ఎలాంటి నూతన మండల, గ్రామ కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేయవద్దని సూర్యాపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య స్పష్టం చేశారు.ఆదివారం తుంగతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంఘటన్ సృజన్ అభియాన్ చైర్మన్ వేణుగోపాల్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఇటీవల చేపట్టిన మండల పార్టీ నియామకాలతో కాంగ్రెస్లోనే భేదాభిప్రాయాలు తలెత్తాయని తెలిపారు. దీంతో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని కలిసి నియోజకవర్గంలోని సమస్యలను వివరించారని పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై నివేదిక తెప్పించుకున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్.. తుది నిర్ణయం తీసుకునే వరకు ఎలాంటి నూతన కమిటీలు ఏర్పాటు చేయవద్దని ఆదేశించినట్లు నరసయ్య తెలిపారు.తుంగతుర్తి నియోజకవర్గంలోని నూతన మండల అధ్యక్షుల ఎంపికపై తుది నిర్ణయం వెలువడే వరకు ఎక్కడా కొత్త గ్రామ కమిటీలు వేయరాదని స్పష్టం చేశారు. కొత్త కమిటీల ఏర్పాటుతో మరోసారి పార్టీలో గందరగోళం తలెత్తకుండా నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు.సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు దొంగరి గోవర్ధన్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మద్ది కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీస్తూ ఉద్యమిస్తాం

### మాజీ మంత్రి పువ్వాడ పిలుపు



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 30 :** ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల తరఫున నిలదీస్తూ ఉద్యమిస్తుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్కుమార్ స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 నుంచి 10 వరకు బీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చిన ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులోనూ, పరిపాలన అందించడంలోనూ పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఈ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు సమగ్రంగా వివరించడంతో పాటు వారిని చైతన్యపరిచేందుకు బీఆర్ఎస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు.ఈ నేపథ్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించే ఈ నిరసన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ మంత్రి పిలుపునిచ్చారు.

## ప్రజలందరి మెప్పు పొందిన వ్యక్తి డాక్టర్ రాములు నాయక్



**ముద్ర, దేవరకొండ:** దేవరకొండ పేదోడి డాక్టర్ నేనావత్ రాములు నాయక్ ప్రథమ వర్ధంతి సందర్భంగా చందంపేట మండలం లోని గన్నేర్లపల్లి గ్రామంలో తన వ్యవసాయ క్షేత్రంలో డాక్టర్ రాములు నాయక్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్, పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ రాములు నాయక్ సేవలు మరువలేనివి అని పేదోడి డాక్టర్ గా ఎంతో మందికి సేవ చేశారని కొనియాడారు. ఆయన మన మధ్యలో లేకున్నా ఆయన జ్ఞాపకాలు పదిలంగా ఉన్నాయని అన్నారు. వారివెంట మండల పార్టీ అధ్యక్షులు టీవీన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, లోక్య నాయక్, వడ్త్య దేవేందర్ నాయక్, కేతావత్ హరిలాల్, వడ్త్య బాలు నాయక్ సర్పంచ్ లు నేనావత్ భరత్, తులసీరాం , కౌన్సిలర్ అజయ్ చంద్ర , మాజీ కౌన్సిలర్ జయప్రకాశ్ ,నేనావత్ జైపాల్ నాయక్ , నేనావత్ నాగార్జున నాయక్ , కిషన్ నాయక్ , రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 31.08.2026
www.mudranews.in | @mudranews
8
జనరల్ న్యూస్
GENERAL NEWS

**నాలుక నునుపుగా, ఎర్రగా మారుతోందా?**

నాలుకలో నొప్పి, మంటతో పాటు ఉపరితలం నునుపుగా మారితే B12 లోపానికి సంకేతం కావచ్చు.



# ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో దేశం సుభిక్షం

**అవినీతికి తావు లేకుండా అన్ని వర్గాల సంక్షేమమే బిజెపి లక్ష్యం**
**కాంగ్రెస్, బి ఆర్ ఎస్ పార్టీలు పర్సంటేజ్ ల పాలన**
**కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** ప్రపంచ అధినేతలు మెచ్చిన భారత ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో దేశం లో అన్ని వర్గాల ప్రజలకుసుభిక్ష పాలన కొనసాగుతుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తాండూర్ పట్టణం వీరశైవ కళ్యాణ మండపంలో వికారాబాద్ జిల్లా బిజెపి నూతన అధ్యక్షులుగా యు రమేష్ కుమార్ పదవి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ పరిపాలన చూసి దేశంలో ఏ పార్టీకి సాధ్యం కానీ విధంగా 18 కోట్ల మంది బిజెపి సభ్యత్వం తీసుకున్నరంటే దేశంలోనీ ప్రజలందరూ బిజెపి పార్టీకి నరేంద్ర మోడీ పాలనకు ఏ విధంగా ఆకర్షితులు అవుతున్నారో ఈ సభ్యత్వమే నిదర్శనమని ఆయన తెలిపారు. అదేవిధంగా 12 సంవత్సరాల కాలంలో నరేంద్ర మోడీ పాలనలో ఎలాంటి అవినీతి, ఎలాంటి దుర్వినియోగం లేకుండా పాలన సాగిస్తున్నారని, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కి ఏం చేయాలో దిక్కుతోచనీ స్థితిలో కాంగ్రెస్ నాయకత్వం కొట్టుమిట్టాడుతుందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కుటుంబ పార్టీలను అంతమొందించాలని, మిగులు బడ్జెట్ గా వున్నా రాష్ట్రాన్ని 13 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చేసిన కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీలను పాత రేయాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారానే ఎన్నో సంక్షేమ పథకాలు పేదలకు రేషన్ బియ్యం, రైతులకు ఆర్థిక సాయం, గ్రామాల్లో రోడ్డు సౌకర్యాలు, అంగన్వాడి భవనాలు, హాస్పిటల్స్ ఇలా ఎన్నో సంక్షేమ ఫలాలు కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారానే రాష్ట్రాల్లో అభివృద్ధి జరుగుతుందే తప్ప రాష్ట్రంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం కమిషన్ల కాంగ్రెస్ ప్రభుత్వంగా మారిందని ఆయన ఎద్దేవా చేశారు. దేశం పట్ల, ప్రజల పట్ల ఏమాత్రం అవగాహన లేని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ నరేంద్ర మోడీ నీ ఏ విషయాల్లో రాజీనామా చేయమంటున్నారో ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. జిల్లా బిజెపినాయకులు వికారాబాద్ జిల్లాను అనంతగిరి జిల్లాగా నామకరణం చేసేందుకు చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి విన్నవించుకున్నారు. వికారాబాద్ జిల్లా నూతన అధ్యక్షులు యు రమేష్ కుమార్ మంచి విద్యావంతుడు ఆయన సారథ్యంలో అందరూ కలిసికట్టుగా ఐక్యమత్యంతో పార్టీ కోసం కష్టపడాలని, ప్రతి ఎన్నికల్లో కూడా బిజెపి పార్టీకి ఆదరణ పెరుగుతూ వస్తుందని అందుకు నిదర్శనం చేవెళ్ల ఎంపీ స్థానాన్ని, తాండూర్ పట్టణ కౌన్సిలర్లను గెలిపించుకున్నామని కాబట్టి జిల్లాలోని అన్ని స్థానాలను తప్పకుండా బిజెపి పార్టీ కైవసం చేసుకుంటుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రామ్, జిల్లా కన్వీనర్ ప్రహ్లాద రావు, జిల్లా ఇన్చార్జ్ సుధాకర్, మాజీ అధ్యక్షులు మాధవరావు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్, తాండూర్ పట్టణ కౌన్సిలర్లు, మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహు శ్రీలత పార్టీ సీనియర్ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు, మండల అధ్యక్షులు వీరశైవ సమాజం సభ్యులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తాండూర్ నాపరాతి పరిశ్రమలకు రక్షణ కల్పించాలి

**తాండూర్ శాసనసభ్యులు మనోహర్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో నాపరాతి వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి శ్రీ.కిషన్ రెడ్డి గారికి వినతిపత్రం అందజేసిన తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండూర్ ప్రాంతానికి నాపరాతి పరిశ్రమలు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయని, ఈ ప్రాంతంలో మైనింగ్ పరిశ్రమ ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఎంతో మంది ఉపాధి కోసం తాండూర్‌కు వచ్చి జీవనం సాగిస్తున్నారని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కేంద్రమంత్రి తో విన్నవించారునాపరాతి పరిశ్రమలపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, ఈ పరిశ్రమలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమలను భారీ పరిశ్రమలుగా రూపాంతరం చేసే విధంగా తీసుకొస్తున్న నూతన నిబంధనల వల్ల తాండూర్‌లోని నాపరాతి పరిశ్రమలు తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నతరహా పరిశ్రమలు భారీ పరిశ్రమలుగా మారితే స్థానిక నాపరాతి వ్యాపారులు అదనపు ఆర్థిక భారాన్ని ఎదుర్కొని నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. అదేవిధంగా రాయల్టీ చార్జీలు పెరగడం వల్ల వ్యాపారులపై అదనపు భారం పడటమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయంపైనా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. నాపరాతి పరిశ్రమలు దెబ్బతింటే వ్యాపారులు నష్టపోవడంతో పాటు వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, ఫలితంగా చాలామంది వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.తాండూర్ ప్రాంత ప్రజలు, నాపరాతి వ్యాపారులు, కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నాపరాతి పరిశ్రమలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ మేరకు కేంద్రం మంత్రి స్పందిస్తూ నాపరాతి పరిశ్రమల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిశ్రమలను పరిరక్షించేందుకు తన వంతుగా కృషి చేస్తానని బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నాపరాతి వ్యాపారస్తులు జుబేర్ లాల, అబ్దుల్ రహూఫ్, అప్పు,( నయుం) వ్యాపారస్తులు తదితరులు ఉన్నారు

# జనగణన ప్రశ్నావళిలో ఓబీసీ కాలమ్ చేర్చాల్సిందే

**బీసీలపై కేంద్రం వివక్షను వీడకపోతే శీతాకాల పార్లమెంట్ సమావేశాలను అడ్డుకుంటాం**
**మహనీయుల చరిత్రను విశ్వవ్యాప్తం చేస్తాం**
**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్**

**ముద్ర, బీదర్:** దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతి జనగణనలో ఓబీసీ కాలమ్‌ను తప్పని సరిగా చేర్చాలని, లేని పక్షంలో వచ్చే శీతాకాల పార్లమెంట్ సమావేశాలను అడ్డుకుంటామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. కర్ణాటకలోని బీదర్ జిల్లా కేంద్రంలోని ఎంఎం క్లాసిక్ గార్డెన్‌లో బీసీ, ఈడిగ సంఘాల ఆధ్వర్యంలో సామాజిక తత్వవేత్త, సంఘ సంస్కర్త నారాయణ గురు, కర్ణాటక బీసీ నేత దేవ రాజ్ అరసు జయంతి వేడుకలు నిర్వహించారు. నారాయణ గురు, దేవరాజ్ అరసు చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నారాయణ గురు చిత్రపటంతో అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలను లెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం భయపడుతోందని ఆరోపించారు. బీసీల జనాభా లెక్కలు తేలితేనే వారి అభివృద్ధికి సరైన ప్రణాళికలు రూపొందుతాయని, చట్టబద్ధమైన హక్కులు దక్కుతా యని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న జాతి జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చకుండా కేంద్రం బీసీలపై వివక్ష చూపుతోందని విమర్శించారు. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై దేశవ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 20న హైదరాబాద్‌లో జాతీయ ఓబీసీ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. 29 రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొనే ఈ సదస్సులో హైదరాబాద్ కేంద్రంగా భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. డాక్టర్ రాజశేఖర్ అధ్యక్షత వహించగా జాతీయ సమన్వయకర్త రామ కోటేశ్వరరావు, బీదర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అమృత్ చింకోడు, సంగయ్య గౌడ్, ప్రొఫెసర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

# రాజకీయాలకు తావులేదు.. అభివృద్ధే ఏకైక అజెండా

**గ్రామం అభివృద్ధి చెందితేనే నియోజకవర్గం అభివృద్ధి చెందినట్లు**
**మాటలు కాదు.. పనులే సమాధానం**
**మంత్రి వాకిటి శ్రీహరి**

**ముద్ర, మక్తల్:** రాజకీయాలకు అతీతంగా మక్తల్ నియోజకవర్గ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా మంత్రి వాకిటి శ్రీహరి పనిచేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా కృష్ణ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధిపై స్థానిక నాయకులతో మక్తల్ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.సమీక్షలో ప్రతి గ్రామానికి ప్రత్యేకంగా సమయం కేటాయించిన మంత్రి.. ఆయా గ్రామాల నాయకుల నుంచి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులు, కొనసాగుతున్న పనులు, చేపట్టాల్సిన పనులపై గ్రామాల వారీగా సమగ్రంగా చర్చించారు.రహదారులు, తాగునీరు, విద్య, పారిశుధ్యం, ఇతర మౌలిక వసతులపై వివరాలు సేకరించారు. అత్యవసర సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ.. “మాటలు కాదు.. పనులే సమాధానం చెబుతాయి” అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కార్య రూపంలోకి తీసుకురావడమే లక్ష్యంగా అభివృద్ధి పనుల వేగాన్ని పెంచేందుకు సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాజకీయాలకు తావులేకుండా.. గ్రామం ఏదైనా అభివృద్ధి ఒక్కటే అజెండాగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. కృష్ణ మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.గ్రామాల సమస్యలను స్థానిక నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఒక్కో గ్రామం అభివృద్ధి చెందితేనే మొత్తం నియోజకవర్గం అభివృద్ధి చెందినట్లు భావిస్తున్నామని మంత్రి తెలిపారు.గ్రామాల వారీగా సమీక్షలు నిర్వహించడం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతోందని, రాబోయే రోజుల్లో అభివృద్ధి పనులకు మరింత ప్రాధాన్యత ఇస్తామనీ వెల్లడించారు.

# హృదయ విదారకం..!

**చెల్లిని కాపాడుకుంటూ.. తల్లిదండ్రుల కోసం వెతుకుతున్న బాలుడు**



ప్రకృతి విపత్తు సృష్టించిన బీభత్సం మధ్య ఓ చిన్నారి తన చెల్లికి అండగా నిలిచిన దృశ్యం కంటతడి పెట్టిస్తోంది. చుట్టూ విధ్వంసం.. ముఖంపై గాయాలు.. మనసులో భయం.. అయినా తన బాధను పట్టించుకోకుండా.. చెల్లిని జాగ్రత్తగా కాపాడుకుంటున్నాడు ఆ బాలుడు. తల్లిదండ్రులు ఎక్కడ ఉన్నారో తెలియదు.. వారు క్షేమంగా ఉన్నారో లేదో తెలియదు.. అయినా చెల్లిని మాత్రం వదలడం లేదు.చెల్లిని దగ్గరకు తీసుకుని.. భయంతో చుట్టూ చూస్తున్న ఆ చిన్నారి ముఖంలోని ఆందోళన ప్రతి ఒక్కరి హృదయాన్ని కలచి వేస్తోంది. నిన్నటి వరకు తల్లిదండ్రుల చేతులు పట్టుకుని నడిచిన ఆ బాలుడు. ఈరోజు తన చెల్లికి తానే అండగా నిలవాల్సిన పరిస్థితి. తల్లిదండ్రుల కోసం వెతుకుతున్న ఆ చిన్నారి కళ్లలో..వారు తిరిగి వస్తారనే ఆశ మాత్రం ఇంకా సజీవంగానే కనిపిస్తోంది. కష్టమొచ్చినప్పుడు వయసుతో సంబంధం లేకుండా బాధ్యత తీసుకునే బంధం..అదే అన్నా చెల్లెళ్ల అనుబంధం. – ముద్ర

# సాయినగర్ కాలనీ సమస్యకు త్వరలో పరిష్కారం

**మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ పట్టణంలోని సాయి నగర్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న రహదారి సమస్యను ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ దృష్టికి తీసుకెళ్లి, అతి త్వరలో సమస్యను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు హామీ ఇచ్చారు.సాయి నగర్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిని నేషనల్ హైవే ఆర్ అండ్ బి అధికారులు బ్లాక్ చేయడంతో కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన చైర్‌పర్సన్ స్పందించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా సమస్యనకు త్వరలో శాశ్వత ప రిష్కార ం లభించేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సంబంధిత నేషనల్ హైవే, ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడి సాయి నగర్ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లారు. రహదారిని యథావిధిగా పునరుద్ధరించేలా అధికారులతో సమన్వయం చేస్తూ, అతి త్వరలో సమస్యకు పరిష్కారం చూపించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# చదువురాని దద్దమ్మ సీఎం రేవంత్ రెడ్డి

**మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్**



**ముద్ర, మోత్కూరు:** రాష్ట్రంలో ఇద్దరు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు రేవంత్, పొంగులేటి కలిసి పాలన చేస్తున్నారని రాష్ట్రంలో భూములను కొల్లగొడుతున్నారనీ రేవంత్ కు పాలనపై కనీస అవగాహన లేదు ఓత్తి ఆఫ్ నాలెడ్జ్ వ్యక్తి రేవంత్ రెడ్డి అని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని దాచారం గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడ్డగోలిగా జి ఓ 97 తెచ్చి పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్ లోకి వెళ్లకుండా నిషేధం విధించాడు రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీని నిర్మిస్తా అని చెప్పడం సిగ్గు చేటని 22 ఎ పేరుతో రాష్ట్రంలో కోటి 16 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిన మూర్ఖుడు ఈ రేవంత్ రెడ్డి 22 ఎ పెరు చెప్పి అడ్డగోలుగా లంచాలు తింటున్నారు. చదువు రాని అవగాహన లేని మూర్ఖపు సీఎం రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ అంటేనే రైతులు దుమ్మెత్తి పోస్తున్నారు.100 రోజుల్లో హామీలు నెరవేరుస్తామని, వెయ్యి రోజులైనా ఒక్కటి కూడా అమలు చేయలేదు రేవంత్ రెడ్డి.అందుకే వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేసి ప్రజలను జాగృతం చేస్తామని సెప్టెంబర్ 2 న తుంగతుర్తి లో భారీ నిరసన ధర్నా నిర్వహిస్తున్నామని సెప్టెంబర్ 3 న మిర్యాలగూడ కేటీఆర్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.కృష్ణా నీటిని చంద్రబాబు ప్రభుత్వం దోచుక పోతుంటే ఈ ప్రభుత్వం నిద్రపోతుందా అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేవూరి ధర్మేందర్ రెడ్డి, బిఆర్ఎస్ అడ్డగూడూరు మండల అధ్యక్షులు కోమ్మిడి ప్రభాకర్ రెడ్డి, తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ రఘునందన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు ఆశీర్వాదం



**ముద్ర, మోత్కూర్:** మోత్కూరు మండలం పాటిమట్ల క్రాస్ రోడ్డులోని డిపిఆర్ పంక్షన్ హాల్ లో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నబోయిన రమేష్ కుమార్తె భవానీ – అఖిల్ గార్ల వివాహ వేడుకకు తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేవూరి ధర్మేందర్ రెడ్డి, అడ్డగూడూర్ మండల అధ్యక్షులు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ రఘువర్ధన్ రెడ్డి, మోత్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తీపి రెడ్డి మెగా రెడ్డి, కొనతం యాకూబ్ రెడ్డి, చిప్పలపల్లి మహేంద్ర నాథ్, బి ఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 22-ఎ నిషేధిత జాబితా నుంచి అర్హులైన రైతుల భూములను విముక్తి చేయాలి



**ముద్ర, మోత్కూర్:** రైతుల భూములపై ఆంక్షలు విధించి వారి హక్కులను కాలరాయడం సరికాదు అని నిషేధిత జాబితాలో ఉన్న అర్హులైన రైతుల భూములను వెంటనే పరిశీలించి, నిషేధిత జాబితా నుంచి తొలగించాలని బీజేపీ మోత్కూరు మండల పార్టీ అధ్యక్షుడు గుదే మధుసూదన్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పనకబండ గ్రామంలో రైతుల సమస్యలను తెలుసుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాట్లాడుతూ ఏళ్ల తరబడి రైతులు సాగు చేసుకుంటూ, హక్కు పత్రాలతో అనుభవిస్తున్న భూములు 22–ఎ జాబితాలో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అవసరాలకు ఆర్థిక సహాయం పొందలేడు. అలాంటప్పుడు ఆ భూమిపై రైతుకు ఉన్న హక్కు ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు రైతుల హక్కుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బీజేపీ రైతుల పక్షాన నిలబడి ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని గుదే మధుసూదన్ యాదవ్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జి గౌరు శ్రీనివాస్,మండలం ఉపాధ్యక్షులు పనకబండ ఉపసర్పంచ్ రాధారపు మల్లేశం, ఉపాధ్యక్షులు గుంటి సతీష్, మార్గం సుజాత, బత్తిని హరికృష్ణ, మండల నాయకులు ఐలమ్మ, రాజమల్లు, వల్లమాల ఆండాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకటించిన కనీస వేతనాలను అమలు చేయాలి

**నాన్ రెగ్యులర్ కార్మికుల రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రభుత్వం మే 21న కనీస వేతనాలను పెంచుతున్నామని విడుదల చేసిన జీవో నెంబర్ 6ను అమలు చేయాలని నాన్ రెగ్యులర్ కార్మికుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం చేగుంట క్లస్టర్ కేంద్రంలో కరపత్రాన్ని విడుదల చేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వాలు 10–15 సంవత్సరాల నుండి కనీస వేతనాలు సవరించకపోవడం వలన కార్మికులు పెరిగిన ధరలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వతంత్రంగా, ఇతర కార్మిక సంఘాలతో కలుపుకొని అనేక పోరాటాలు ఆందోళనలు నిర్వహించినందున గత ప్రభుత్వం 2014 నుండి మూడుసార్లు కనీస వేతనాల సలహా మండలి నియమించినప్పటికీ జీతాలు పెంచలేదని మండిపడ్డారు. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 78 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో కనీస వేతనాలు పెంచాలని, అదికూడా సలహా మండలి దృష్టిలో పెట్టుకొని జీతాలు పెంచాలని, ఎలాంటి సిఫార్సులను సలహాలను పరిగణలోకి తీసుకోకుండా అశాస్త్రీయంగా మే 21న కనీస వేతనాలు పెంచుతున్నట్లు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిందని ఆయన అన్నారు. తెచ్చిన వేతనాలను కూడా మూడు జోన్లుగా విభజించి అన్ని రకాల కార్మికులను కలిపి నాలుగు కేటగిరీలుగా (అన్ స్కిల్డ్, సెమిస్కిల్డ్, హై స్కిల్డ్)గా విభజించారన్నారు. అన్ని రంగాల్లో ఒకే రీతిలో జీతాలు పెంచడం వలన గతంలో వివిధ షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ వివిధ రకాల పనులకు వేరువేరుగా జీతాలు చెల్లించే పద్ధతి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతారని కార్మికులకు నష్టదాయకంగా ఉంటుందని ఆయన మండిపడ్డారు. కర్ణాటకలో 60 శాతం కార్మికులకు కనీస వేతనాలు పెంచి అమలు చేస్తుందన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రానికి 30 శాతం మాత్రమే వేతనాలను పెంచి చేతులు దులుపుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా పెద్ద ఫార్మా అండ్ కెమికల్స్ పరిశ్రమలు కూడా కాంట్రాక్టు పేరుతో కార్మికుల శ్రమను దోచుకుంటారని ఆయన ఆరోపించారు. ప్రతి కార్మికునికీ కనీసం నెలకు రూ. 26 వేలు నిర్ణయించి అమలు చేయాలని, కరువు భత్యం ప్రతి పాయింట్ కు 12 రూపాయలుగా నిర్ణయించాలని, ప్రభుత్వం ప్రకటించిన మూడు జోన్ల విధానాన్ని రద్దు చేయాలని, జీవో నెంబర్ 6 ప్రకారం కాకుండా 10 శాతం పెంచి ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, వారాంతపు సెలవులు, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు మెదక్ జిల్లా కార్యదర్శి పరిశ్రమల కార్మికులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H. No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555